

బత్తుల జాలమ్మ కుటుంబ సభ్యులతో ముఖ్యమంత్రి చంద్రబాబు



యల్లావుల రమ్య కుటుంబ సభ్యులకు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు అనగాని, పార్థసారథి, ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే సాంబశివరావు



చంద్రబాబుతో వస్తున్న మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

వరాల జల్లు

- మోడల్ గ్రామంగా కొత్తగొల్లపాలెం
- తీర ప్రాంత గ్రామాల అభివృద్ధికి నిధులు
- మోటుపల్లిలో కీలక ప్రాజెక్టుల సాధనకు కృషి
- కృష్ణా పశ్చిమ డెల్టా కొమ్మమూరు కాల్వ ఆధునికీకరణకు రూ.5 కోట్లు ఎంపీ తెన్నేటి, ఎమ్మెల్యే ఏలూరిపై సీఎం ప్రశంసలు
- కొత్తగొల్లపాలెంలో పింఛన్ల పంపిణీ చేసిన సీఎం చంద్రబాబు నాయుడు


చినగంజాం మండలం కొత్తగొల్లపాలేన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం.. తీరప్రాంత గ్రామాల అభివృద్ధికి నిధులు.. మోటుపల్లి తీరంలో కీలక ప్రాజెక్టుల సాధనకు కసరత్తు.. కాల్వల ఆధునికీకరణకు రూ.5 కోట్లు, పర్చూరు నియోజకవర్గంలో రోడ్లు, 11 లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను ఆధునికీకరిస్తాం.. ఇలా జిల్లాపై ముఖ్యమంత్రి చంద్రబాబు వరాల జల్లు కురిపించారు. సామాజిక పింఛన్ల పంపిణీ కోసం మంగళవారం చినగంజాం మండల పరిధిలోని కొత్తగొల్లపాలేనికి ముఖ్యమంత్రి వచ్చారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా పింఛన్లను అందజేశారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజావేదికలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ప్రజలు సమస్యలు వినడమే తరువాయి వెంటనే వాటి పరిష్కారం కోసం కలెక్టర్‌కు ఆదేశాలివ్వడం, ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని అనేక సమస్యలకు మోక్షం కలిగేలా వరాలు కురిపించారు.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఏప్రిల్ నెలకు సంబంధించి సామాజిక పింఛన్ల పంపిణీ జిల్లాలోని కొత్తగొల్లపాలేన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం సందర్శించారు. ఐదు గంటలపాటు గ్రామంలోనే ముఖ్యమంత్రి ఉన్నారు. ఈ సందర్భంగా కొత్తగొల్లపాలేనికి సీఎం వరాల జల్లు కురిపించారు. రెండేళ్లలోనే గ్రామం రూపురేఖలను మార్చుతామన్నారు. 2029 కల్లా గ్రామంలో పేదరికం కనుమరుగవ్వాలన్నారు. ఆదర్శం గ్రామంగా తీర్చిదిద్ది రాష్ట్రానికే నమూనా చేస్తామన్నారు. గ్రామంలో వచ్చిన వినతులపై సీఎం సానుకూలంగా స్పందించారు. పింఛన్ ఇవ్వడానికి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లిన సీఎం అక్కడికక్కడే ఓ కుటుంబానికి ఇంటి మంజూరుతో పాటు బీసీ కార్పొరేషన్ కింద రుణం మంజూరుకు కలెక్టర్‌కు ఆదేశాలిచ్చారు. పశువుల దాణాలాగా జీవాల పోషకులకు ఇంటి దగ్గరే మేతను ఏర్పాటు చేయడంతో పాటు వారికి షెడ్లు కట్టి ఇచ్చే అంశంలో ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని కలెక్టర్ వెంకటమురళిని ముఖ్యమంత్రి ఆదేశించారు. కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలోని కొమ్మమూరు కాల్వల ఆధునికీకరణకు రూ.5 కోట్లు అదనంగా విడుదల చేస్తున్నట్లు సీఎం తెలిపారు. తీర ప్రాంత గ్రామాల అభివృద్ధికి రూ.14 కోట్లు విడుదలకు అనుమతిచ్చారు. మోటుపల్లి తీరంలో ప్రతిపాదనల దశలో ఉన్న నౌక నిర్మాణ పరిశ్రమను సాధనకు హామీ ఇచ్చారు. గుంటూరు ఛానల్ ఆధునికీకరణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తామని తెలిపారు. వ్యవసాయ ఆధారిత పర్చూరులో తీవ్ర వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు 11 లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను ఆధునికీకరించేలా కార్యాచరణ రూపొందిస్తామన్నారు. జిల్లాలో పెండింగ్ ఉన్న నాగార్జునసాగర్ కాల్వల మరమ్మతులతో పాటు కాల్వల ఆధునికీకరణకు నిధులను త్వరలోనే మంజూరు చేస్తామన్నారు. పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా రూ.9 కోట్లతో జాతీయ రహదారి నుంచి వలపర్ల ఇండస్ట్రియల్ పార్కు వరకు డబుల్ రోడ్డు అంశాన్ని కూడా పరిశీలిస్తున్నామన్నారు.

మారుమూల గ్రామానికి రావడం అదృష్టం

సీఎం చంద్రబాబునాయుడు తన నియోజకవర్గ పరిధిలోని మారుమూల గ్రామమైన కొత్తగొల్లపాలెంలో పింఛన్ల పంపిణీకి వేదిక చేసుకోవడంపై పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆనందం వ్యక్తం చేశారు. పర్చూరు నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే ఏలూరికి ఉన్న కమిట్‌మెంట్ గొప్పదని సీఎం అన్నారు. వరుసగా మూడోసారి గెలిచి హ్యాట్రిక్ సాధించారని, సొంతంగా ఎదిగి ఆ తర్వాతే రాజకీయాల్లోకి వచ్చిన అతి కొద్దిమందిలో ఏలూరి ఒకరని ప్రశంసించారు. తనను ఎంపీని చేయడంతో పాటు లోక్‌సభలో ప్యానెల్ స్పీకర్ చేసిన సీఎం చంద్రబాబుకు కృష్ణప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. ఐపీఎస్ అధికారిగా ఉన్నప్పటి నుంచి తెన్నేటి కృష్ణప్రసాద్‌తో తనకు అనుబంధం ఉందని సమర్థవంతమైన అధికారిగా పేరు తెచ్చుకున్నారని చంద్రబాబు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు రవికుమార్, సత్యప్రసాద్, బాలవీరాంజనేయస్వామి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యేలు విజయ్‌కుమార్, నరేంద్రవర్మ, కొండయ్య, ఆనంద్ బాబు, తదితర నేతలు పాల్గొన్నారు



గ్రామంలో పింఛన్ లబ్దిదారు సుభాషిణి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కలెక్టర్ వెంకట మురళి

- ఇంటి పరిసరాలను పరిశీలిస్తూ..



- వృద్ధుడి సమస్య వింటూ..



పనితీరు ఆధారంగా రేటింగ్

ఎమ్మెల్యేలు, నేతలు ఇంకా మెరుగుపడాలి

'నాతో సహా అందరి పనితీరుపై ఎప్పటికప్పుడు సమీక్ష జరిపి పనితీరు ఆధారంగా రేటింగ్ ఇవ్వడం జరుగుతుంది. పనితీరు పేలవంగా ఉన్న ఎవరైనా సరే తీరు మార్చుకోవాల్సిందే. ప్రస్తుతం ఉన్న నివేదికలను పరిశీలిస్తే ఎమ్మెల్యేలు, నేతల పనితీరు ఇంకా మెరుగుపడాల్సి ఉంది..' అని సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. కొత్తగొల్లపాలెంలో జరిగిన పార్టీ క్యాడర్ సమావేశంలో సీఎం మాట్లాడారు. ఎంతటి గొప్ప నేతలైనా సరే వారి పనితీరు మెరుగ్గా ఉండాలన్నారు. లేని పక్షంలో మరికొంత సమయం ఇచ్చి చూస్తానని అప్పటికీ మార్పు లేకపోతే వేరే వారికి అవకాశం కల్పిస్తానని తేల్చిచెప్పారు. టీడీపీ అంటేనే సమర్థవంతమైన నాయకత్వానికి కర్మాగారం వంటిదన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలే ప్రామాణికంగా పదవులు ఇవ్వబోనని తెలిపారు. కార్యకర్తలు జెండా మోసి పార్టీని అధికారంలోకి తీసుకు వచ్చారని, వారిని అన్ని విధాల పైకి తీసుకొచ్చే బాధ్యత తనదేనన్నారు. వారి సంక్షేమం కోసం పార్టీ కట్టుబడి ఉందన్నారు. కార్యకర్తలను క్రమశిక్షణతో ఉంచే ఏకైక పార్టీ టీడీపీ అని గుర్తుచేశారు. రానున్న నాలుగేళ్లల్లో అన్ని నియోజకవర్గాల్లో తిరిగి కార్యకర్తలకు అభినందనలు చెప్పే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు ప్రకటించారు. నాయకులు కూడా జెండాను మోసిన కార్యకర్తలను గుర్తించి వారికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మోటుపల్లి పంచాయతీ పరిధిలోని రుద్రామాంబపురానికి చెందిన టీడీపీ కార్యకర్త పద్మ హత్యకు గురికావడంతో ఆమె పిల్లలకు పార్టీ అండగా ఉందన్నారు. గత ప్రభుత్వంలో టీడీపీ వారి పై తప్పుడు కేసులు బనాయించి ఇబ్బందులకు గురిచేశారని వారిపై చర్యలు తీసుకోవాలని కారంచేడు మండలం కుంకలమర్రు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కొల్లా సుబ్బరాయుడు ముఖ్యమంత్రిని కోరారు. పాం? దొంగలపై చర్యలు లేవని, పంచాయతీల్లో జరిగిన అవకతవకలపై తాము పోరాడుతుంటే అధికారులు వారికి కొమ్ముకాసేలా నివేదికలు ఇస్తున్నారన్నారు. సరైన ధరలు లేక ఇబ్బంది పడుతున్న పొగాకు రైతులను ఆదుకోవాలని పర్చూరు మండల మాజీ జడ్పీటీసీ దాసరి ఉషారాణి కోరారు.



ప్రజల వద్ద వినతులు స్వీకరిస్తూ..


చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న మంత్రి గొట్టిపాటి రవి, ఎమ్మెల్యే వేగేశన



- దివ్యాంగులకు వాహనం అందిస్తూ..



- బామ్మ ప్రసంగాన్ని ఆలకిస్తూ..






హాజరైన ప్రజలు

కొటేషన్లతో.. కొట్టేశారు



- కొండెక్కిన వ్యవసాయ యంత్రాల ధరలు
- గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు రూ.8.56 కోట్లు
- సబ్సిడీ నిధుల్లో అధికారుల జేబుల్లోకి 12 శాతం?
- స్ప్రేయర్ ధర రూ.21 వేలు.. రూ.27 వేలకు బిల్లు

గుంటూరు సిటీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా ఏకమొత్తంగా ఏదైనా వస్తువులు కొనుగోలు చేస్తే వాటి ధర తగ్గుతుంది. ఇక తయారీ సంస్థలనే నేరుగా సంప్రదిస్తే మరింత తగ్గా ధర తగ్గుతుంది. అదే ప్రభుత్వం అనుకుంటే ఇంకా తగ్గాలి. కానీ అదేమిటో కానీ విచిత్రంగా బహిరంగ మార్కెట్లోని ధర కంటే పెరిగిపోతోంది. అధికారుల కమీషన్ల మాయతో ధరలను పెంచేసి లబ్ధిదారులపై భారం మోపుతున్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు పంపిణీ చేస్తున్న సబ్సిడీ యంత్రాల పరిస్థితి ఇలాగా ఉంది. రైతు నేరుగా వెళ్లి కొనుగోలు చేస్తే అదే యంత్రం తక్కువ ధరకు వస్తుంది. అదే వ్యవసాయ శాఖ సబ్సిడీ ద్వారా అంటే రేటు కొండెక్కుతోంది. ఉదాహరణకు తైవాన్ పవర్ స్ప్రేయర్లు మార్కెట్‌లో రూ.21 వేల నుంచి రూ.22 వేల వరకు దొరుకుతున్నాయి. వాటి ధరను వ్యవసాయ శాఖ రూ.27 వేల వరకు నిర్ణయించింది. మండల స్థాయి నుంచి కమిషనరేట్ వరకు కమీషన్లు కలుపుకోవడంతో ఒక్కో యంత్రం ధర రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు పెరిగింది. 50 శాతం సబ్సిడీ పేరుతో అధికారులు జేబులకు చిల్లు పెడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం రూ.8.56 కోట్లు మంజూరు చేసింది. గుంటూరు జిల్లాకు మొత్తం 1727 వ్యవసాయ యంత్రాలు మంజూరు చేయగా, సబ్సిడీ నిమిత్తం రూ.2.91 కోట్లను కేటాయించింది. పల్నాడు జిల్లాలో 1715 వ్యవసాయ యంత్రాలు మంజూరు చేయగా సబ్సిడీ నిమిత్తం రూ.2.80 కోట్లు కేటాయించారు. బాపట్ల జిల్లాలో 1719 వ్యవసాయ యంత్రాలు మంజూరు చేయగా, రూ.2.85 కోట్లు సబ్సిడీగా కేటాయించారు.



జీఎస్టీ పేరు చెప్పి..

సబ్సిడీ యంత్రాల ధరలు పెరగడానికి అధికారులు కొత్త భాష్యం చెబుతున్నారు. జీఎస్టీ కారణంగానే ధరల్లో తేడా ఉన్నట్లు పేర్కొంటున్నారు. ఏపీ ఆగ్రోస్‌కి రెండు శాతం చెల్లించాల్సి వస్తుందంటున్నారు. అయితే అధికారులు చెబుతున్న కారణాలను రైతులు పట్టించుకునే పరిస్థితిలో లేరు. సబ్సిడీ పేరుతో అధికారులు అవినీతితో తమను దోచుకుంటున్నారని ఆరోపిస్తున్నారు.

మార్కెట్లో తక్కువ ధర..

ప్రభుత్వం రైతులకు అండగా ఉండేందుకు సబ్సిడీపై ఏవైతే యంత్రాలు ఇస్తామని చెబుతుందో ఆయా యంత్రాలు బహిరంగ మార్కెట్‌లో చాలా తక్కువ ధరకు వస్తున్నాయి. ఉదాహరణకు రోటావేటర్ మార్కెట్ ధర రూ.1.15 లక్షల వరకు ఉండగా, సబ్సిడీ ధర రూ.1.45 లక్షలుగా నిర్ణయించారు. మిగిలిన యంత్రాలు విలువ కూడా మార్కెట్‌లో చాలా తక్కువగా ఉన్నా సబ్సిడీ పేరు చెబితే ఎక్కువ చెబుతున్నారు. సబ్సిడీ యంత్రాలు సరఫరా చేసేందుకు అధికారులు రాష్ట్ర స్థాయిలో కొటేషన్లు ఆహ్వానించగా ఆ సమయంలోనే కమీషన్లు నిర్ణయం జరిగిందని సమాచారం. దీంతో యంత్రాలకు అసలు ధరకు మించి కొటేషన్లు ఇవ్వాలని ముందుగానే అధికారులు వ్యాపారులకు సూచించినట్లు తెలుస్తుంది. అసలు ధర కన్నా కనీసం 12 శాతం ఎక్కువగా కొటేషన్లు ఉండాలని నిర్ణయించారు. దానికి అనుగుణంగా కొటేషన్లు ఇచ్చిన వారికి మాత్రమే యంత్రాల సరఫరాకు అవకాశం దక్కినట్లు తెలుస్తుంది. వ్యవసాయ యంత్రాల కొనుగోలులో మిగులు సొమ్మును ఎవరికి ఎంత పంపాలన్న దానిపై కూడా పూర్తిగా ఒప్పందం జరిగినట్లు సమాచారం. కింద స్థాయిలోని అధికారుల నుంచి వ్యవసాయ శాఖ కమిషనరేట్‌లో ఉన్న కొందరు అధికారులకు చేరేలా ప్రణాళికలను రూపొందించారు.

ఆరు పళ్ల విభాగంలో కేసానపల్లి ఎడ్లకు ప్రథమస్థానం 6

4 నుంచి జాతీయస్థాయి నాటిక పోటీలు 6
రెండు రాష్ట్రాల నుంచి 10 ప్రదర్శనలు ఎంపిక

73 మంది పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి
- పీఎస్ గ్రేడ్- 4 నుంచి గ్రేడ్- 3గా బాధ్యతలు

6 నాలుగు రిటైల్ మందుల దుకాణాల లైసెన్స్‌ల రద్దు
- నర్సరావుపేటలో రూ.18.50 లక్షల మందుల సీజ్

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగింపు

సూర్యలంకలో సందడి

దీక్షల ముగింపుతో తీరానికి పోటెత్తిన ముస్లింలు



వర్సిటీలో కోర్సుల రద్దుపై ఉద్యమిస్తాం

విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు

పెదకాకాని, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పలు కోర్సులను రద్దుచేస్తున్నట్లు ఈసీ కమిటీ సమావేశంలో తీర్మానించడం అత్యంత బాధాకరమని, దీనిపై పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని పీజీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ లీగల్ స్టడీస్, రీసెర్చ్ పరిరక్షణ జేఏసీ నాయకులు తెలిపారు. మంగళవారం వర్సిటీలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ



వర్సిటీలో ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు

యూనివర్సిటీ అధికారులు పత్రికాముఖంగా తెలియజేసిన ప్రకటన ద్వారా ఎల్ఎల్ఎంలో కొన్ని కోర్సులను ఈ విద్యా సంవత్సరం నుంచి నిలిపివేస్తున్నట్లు వార్తలను చదివి దిగ్భ్రాంతికి లోనయ్యామన్నారు. దశాబ్దాల చరిత్ర కలిగిన మన విశ్వవిద్యాలయ న్యాయవిభాగం ద్వారా ఎందరో పేద,గ్రామీణ విద్యార్థులు ఇక్కడ న్యాయ శాస్త్రం అభ్యసించి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్థాయికి చేరుకున్న సంగతి మీకు విదితమేనని, గత కొన్ని రోజులుగా ఒక అధ్యాపకుని కారణంగా కుల వివక్ష నెపంతో వర్సిటీ ప్రతిష్ఠకు భంగం ఏర్పడింది కానీ అతనిపై ఏ చర్య తీసుకోలేని అధికారులు పేద విద్యార్థుల భవిష్యత్తును సమాధి చేయటం ఏమంత సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా కోర్సుల మూసివేత చర్యను మాని న్యాయవిభాగాన్ని బలోపేతం చేసేలాగా తద్వారా పేద, గ్రామీణ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు గిరీష్, జీ శ్రీనివాసరావు, మధులత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

4 నుంచి జాతీయస్థాయి నాటికల పోటీలు

రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 10 ప్రదర్శనలు ఎంపిక

యడ్లపాడు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం 22వ జాతీయస్థాయి నాటికల పోటీలు ఏప్రిల్ 4,5,6 తేదీలలో నిర్వహించనున్నట్లు తెలుగు నాటక పరిషత్‌ల సమ్మేళనం(వేదిక), యడ్లపాడు పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రదర్శనకు ఎంపికైన నాటికల వివరాలను ఆయన మంగళవారం వెల్లడించారు. యడ్లపాడులోని పుచ్చలపల్లి సుందరయ్య కళా ప్రాంగణంలోని ఎంవీ చౌదరి కళావేదికపై పండుగ వాతావరణంలో ఈ పోటీలను నిర్వహించనున్నట్లు చెప్పారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ పోటీలలో మొత్తం 10 నాటికలు ప్రదర్శితం కానున్నాయన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలోని వివిధ కళాపరిషత్‌ల వేదికలపై ప్రదర్శించబడి అవార్డులు పొందిన అత్యుత్తమైన నాటికలను పరిశీలించి ప్రదర్శనకు ఎంపిక చేయడం జరిగిందని సురేష్‌బాబు తెలిపారు.

పెరిగిన సంగం పాల అమ్మకపు ధరలు

పొన్నూరు టౌన్, ఏప్రిల్, 1 (ఆంధ్రజ్యోతి) : సంగం డెయిరీ పాల అమ్మకపు ధరలు లీటరుకు రూ.2ల చొప్పున పెంచినట్లు ఎండీ పీ గోపాలకృష్ణన్ తెలిపారు. సంగం గోల్డ్ ప్లస్ అర లీటరు ప్యాకెట్ ధరను రూ.36 నుంచి 37కు, సంగం డోల్డ్ అర లీటరు ప్యాకెట్ ధరను రూ..35 నుంచి 36కు, టీ స్పెషల్ అరలీటరు ప్యాకెట్ ధరను రూ.34 నుంచి 35కు, ఎస్‌పీఎమ్ ప్యాకెట్‌ను రూ.31 నుంచి 32కు, టీఎం పాలను రూ.28నుంచి 29కు, డీటీఎం పాలు అరలీటరు రూ.26 నుంచి 27కు ధరలు పెంచినట్లు తెలిపారు. పెంచిన ధరలు సోమవారం నుంచి అమలులోకి వచ్చినట్లు మేనేజింగ్ డైరెక్టర్ గోపాలకృష్ణన్ తెలిపారు.

ఆరు పళ్ల విభాగంలో కేసానుపల్లి ఎడ్లకు ప్రథమస్థానం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శనలో ఆరుపళ్ల విభాగంలో దాచేపల్లి మండలం కేసానుపల్లికి చెందిన నెల్లూరు రామకోటయ్య ఎడ్ల జత విజేతగా నిలిచింది. 15 నిమిషాల వ్యవధిలో 3986 అడుగుల దూరం బండ లాగి ప్రథమస్థానంలో నిలిచాయి. తెనాలి మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న ఎడ్ల బల ప్రదర్శన పోటీల్లో ఆరుపళ్ల విభాగంలో 14 జతల ఎడ్లు పోటీ పడ్డాయి. సూర్యాపేట జిల్లా కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ఎడ్ల జత 3900 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానం, ప్రకాశం జిల్లా ఆకివీడుకు చెందిన రైతు పూజితరెడ్డి ఎడ్ల జత 3772 అడుగుల దూరం లాగి తృతీయ స్థానం, సూర్యాపేట జిల్లా మేళ్లచెరువుకు చెందిన రైతులు గోవర్ధనరెడ్డి, రాయుడు సుబ్బారావుల కంబైన్డ్ ఎడ్లజత 3676 అడుగుల దూరం లాగి నాల్గో స్థానం, కృష్ణా జిల్లా యనమలకుదురుకు చెందిన రైతు కావ్యశ్రీ, మధుల ఎడ్ల జత 3600 అడుగుల దూరం లాగి ఐదో స్థానం, వేటపాలెంకు చెందిన రైతు శిరీషా చౌదరి, అనంతవరంకు చెందిన రైతు ఏలూరి సాంబశివరావు కంబైన్డ్ ఎడ్ల జత 3522 అడుగుల దూరం లాగి ఆరో స్థానం, కుక్కలవారిపాలెంకు చెందిన రైతు శివజ్ఞానేశ్వర రెడ్డి, మోక్షితరెడ్డి ఎడ్ల జత 3300 అడుగుల దూరం లాగి ఏడో స్థానం, యద్దనపూడికి చెందిన రైతు ఖాదర్ మస్తాన్, బోగాది పూర్ణ ఎడ్లజత 3094 అడుగుల దూరం లాగి ఎనిమిదో స్థానం, కోదాడకు చెందిన రైతు కొప్పుల శ్రీనివాసరెడ్డి, కుంచనపల్లికి చెందిన రైతు నిక్షిత్ రెడ్డిల కంబైన్డ్ ఎడ్ల జత 2850 అడుగుల దూరం లాగి తొమ్మిదో స్థానంలో నిలిచాయి. విజేతలకు (వరుసగా ప్రథమ నుంచి తొమ్మిదో స్థానం వరకు) దాతలు కొరటాల శ్రీరామమూర్తి కుటుంబ సభ్యులు రూ.50 వేలు, కొడాలి రమణబాబు రూ.40 వేలు, ఉయ్యూరు శ్రీనివాసరెడ్డి రూ.35 వేలు, ఆళ్ల సురేష్ రెడ్డి, రమేష్‌రెడ్డి, రూ.30 వేలు, బోడపాటి బసవేశ్వరరావు రూ.25 వేలు, వి-ఫర్నీచర్ రామమోహనరావు రూ.20 వేలు, శరణుబాబు రూ.15 వేలు, తాడేపల్లి సూర్యనారాయణమూర్తి రూ.12 వేలు, గుత్తా సోమశేఖర్ రూ.10 వేలు బహుమతులు అందజేశారు. మిగిలిన ఐదుగురు పార్టిసిపెంట్స్‌కు రూ.5 వేలు ప్రోత్సాహక నగదు అందించారు. విజేతలకు ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు బహుమతులు అందజేశారు.



విజేత కేసానుపల్లి ఎడ్లతో మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్సీ ఆలపాటి

పాల పోటీల్లో పెదరావూరు ఆవుకు ప్రథమ స్థానం

పాల పోటీలలో పెదరావూరు ఆవుకు ప్రథమ స్థానం లభించింది. పోటీల్లో 13మంది రైతులు తమ ఆవులను పోటీలకు తీసుకు వచ్చారు. పశు సంవర్ధక శాఖ అధికారుల పర్యవేక్షణలో సోమవారం పొదుగులను ఖాళీ చేయించారు. మంగళవారం ఉదయం, సాయంత్రం రెండు పూటల తీసిన పాలను కొలిపించగా పెదరావూరు రైతు పాలడుగు సురేంద్రకు చెందిన ఆవు 12.650 లీటర్ల పాలు అందించి ప్రథమ స్థానంలో నిలిచింది. గుంటూరు రైతు పసుపులేటి కృష్ణ ఆవు 10.450 లీటర్ల పాలు అందించి ద్వితీయ స్థానంలో నిలిచింది. మేడికొండూరు రైతు తుబాటి పవన్‌చౌదరి ఆవు 8.80 లీటర్లు, తెనాలి రైతు కంచర్ల సాంబశివరావు ఆవు 6.350 లీటర్ల పాలు అందించి కన్సోలేషన్ బహుమతి పొందాయి. పశు సంవర్ధక శాఖ అధికారులు అడుసుమల్లి మధుసూదనరావు, నరసింహారావు, పద్మావతి, నాగిరెడ్డి, విశ్రాంత అధికారి ఆలపాటి వెంకట్రామయ్య తదితరులు పోటీలను పర్యవేక్షించారు.



ప్రథమ స్థానం పొందిన ఆవుతో రైతు సురేంద్ర

రూ.2015 కోట్లకు చేరిన సంగం టర్నోవర్

చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), ఏప్రిల్, 1 (ఆంధ్రజ్యోతి) : సంగం డెయిరీ వార్షిక టర్నోవర్ రూ.2015 కోట్ల మైలురాయిని అధిగమించిందని చైర్మన్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తెలిపారు. వార్షిక టర్నోవర్ రూ.2015 కోట్లు అధిగమించిన సందర్భంగా మంగళవారం వడ్లమూడి సంగం డెయిరీలో విజయోత్సవాలు నిర్వహించారు. కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. అనంతరం చైర్మన్ నరేంద్రకుమార్ మాట్లాడుతూ తాను 2వసారి సంగం డెయిరీ చైర్మన్ అయ్యేనాటికి రూ.200 కోట్లు మాత్రమే టర్నోవర్ ఉందన్నారు. నేడు పాల రైతులు, వినియోగదారుల ఆదరాభిమానాలు పాలకవర్గం, అధికారులు, సిబ్బంది కృషి కారణంగా రూ. రెండు వేలకోట్ల మైలురాయిని అధిగమించామని తెలిపారు. రాబోయే రోజుల్లో రూ.2200 కోట్ల టర్నోవర్ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రోజుకు 10.50లక్షల లీటర్ల పాలసేకరణ చేస్తున్నట్లు, రాబోయే రోజుల్లో రోజుకు అదనంగా లక్షన్నర లీటర్ల పాలు సేకరించేలా 14 కొత్త చిల్లింగ్ సెంటర్లను ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. గత ప్రభుత్వ హయాంలో తన పైన, సంగం డెయిరీ పైన వైసీపీ పాలకులు వేధింపులకు పాల్పడి అక్రమ కేసులు పెట్టి జైలు పాలు చేశారన్నారు. ప్రభుత్వం కుట్రలను ఉద్యోగులు, రైతులు సంఘటితంగా నిలిచి తిప్పికొట్టారన్నారు. రానున్న రోజుల్లో నూతన ఉత్పత్తులను మార్కెట్లో ప్రవేశపెట్టడమే కాకుండా విదేశాలకు సంగం ఉత్పత్తులను ఎగుమతి చేయనున్నట్లు నరేంద్రకుమార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎండీ పీ గోపాలకృష్ణన్, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సంగం డెయిరీలో కేక్ కట్‌చేస్తున్న చైర్మన్ నరేంద్రకుమార్, సిబ్బంది

బస్సును దొంగిలించిన వ్యక్తి అరెస్టు



బస్సును దొంగిలించుకు వెళుతూ పట్టుబడిన నాగేశ్వరరావు

మేడికొండూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న బస్సును తీసుకెళుతున్న ఓ దొంగ బస్సును వేగంగా నడుపుతూ ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురు వలస కూలీలు గాయపడ్డారు. పేరేచర్ల సమీపంలో మంగళవారం జరిగిన ఈ ప్రమాదంలో గాయపడిన వారిని అంబులెన్స్‌లో గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వారిలో ఏడేళ్ల బాలుడు లక్ష్మీనారాయణకు తీవ్ర గాయాలు కాగా తుపాకుల జయమ్మ, సుబ్బారావు, మాణిక్యమ్మతో పాటు మరో ముగ్గురికి గాయాలయ్యాయి. వీరందరూ కర్నూలు జిల్లా నుంచి వలస కూలీలుగా మేడికొండూరు మండలం సరిపూడి గ్రామానికి వచ్చి పొలం పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. పొలం పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా పేరేచర్ల సమీపంలో బస్సు ఢీకొట్టటంతో ఆటో బోల్తా పడి గాయాలపాలయ్యారు. విషయం తెలుసుకున్న సీఐ షేక్ హసన్ సాహెబ్ ప్రమాద స్థలానికి చేరుకొని బస్సును వెంబడించి సత్తెనపల్లి సమీపంలోని లయోలా ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఆపి ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకొని స్టేషన్ తరలించారు.

ఆటోను ఢీకొట్టడంతో వలస కూలీలకు గాయాలు..

మేడికొండూరు పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండలపరిధిలోని ఎస్ఆర్ఐ కళాశాలకు చెందిన బస్సును డ్రైవరు మందులు కొనుగోలు చేసుకోవడానికి పేరేచర్ల జంక్షన్‌లో ఆపాడు. గుర్తు తెలియని వ్యక్తి వచ్చి బస్సును నడుపుకుంటూ తీసుకెళ్లినట్లు డ్రైవరు పోలీసులకు తెలిపాడు. మేడికొండూరు పోలీసులు పల్నాడు జిల్లా లయోలా ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో బస్సును అదుపులోకి తీసుకొని దొంగను అరెస్టు చేశారు. బస్సు దొంగిలించిన వ్యక్తి జంగారెడ్డిగూడెంనకు చెందిన పొన్నవోలు నాగేశ్వరరావు అని పోలీసులు తెలిపారు. నాగేశ్వరరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గంట వ్యవధిలో కేసు ఛేదించిన పోలీసులు

బస్సును దొంగిలించి వలస కూలీల ఆటోను ఢీ కొట్టి, పరారైన బస్సును గంట వ్యవధిలోనే మేడికొండూరు పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఈ సంఘటనతో అప్రమత్తమైన సీఐ నాగూర్ మీరా సాహెబ్, ఎస్ఐ ఖాజిబాబు తమ సిబ్బందితో కలిసి సత్తెనపల్లి వైపు పోలీస్ వాహనంతో హుటాహుటిన వెళ్లడంతో దొంగను గంట వ్యవధిలోనే పట్టుకున్నారు.

నేడు ఆలపాటి ప్రమాణ స్వీకారం



గుంటూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు- కృష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి శాసనమండలికి ఎన్నికైన మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ నేడు ప్రమాణస్వీకారం చేయనున్నారు. శాసన మండలి ఛైర్మన్ సమక్షంలో మధ్యాహ్నం 2 గంటలకు ప్రమాణస్వీకారం చేసేందుకు ముహూర్తం ఖరారైంది. ఆయనతో పాటు శాసన మండలికి ఎన్నికైన మిగతా ఎమ్మెల్సీలు కూడా అదే సమయంలో ప్రమాణస్వీకారం చేయనున్నట్లు తెలిసింది. వాస్తవానికి ఎమ్మెల్సీ ఎన్నికలు ఫిబ్రవరి 27న జరగ్గా కౌంటింగ్ ప్రక్రియ మార్చి 3న నిర్వహించగా భారీ మెజార్టీతో ఆలపాటి విజయం సాధించారు. అయితే ఇప్పటి వరకు ఆ స్థానంలో కొనసాగుతున్న లక్ష్మణరావు పదవీకాలం మార్చి నెలాఖరు వరకు ఉండటంతో ఆలపాటి ప్రమాణస్వీకారం చేసేందుకు వీలుకాలేదు.

రూ.9.67 లక్షల సిగరెట్లు సీజ్

మాచర్లటౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చర్చిబజారులోని శ్రీవినాయక ఫ్యాన్సీ అండ్ జనరల్ స్టోర్స్‌లో రూ.9,67,300 విలువైన నిషేధిత సిగరెట్లను విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. మంగళవారం స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి విజిలెన్స్ అధికారులు ఆ దుకాణంపై దాడులు చేశారు. సీజ్ చేసిన సిగరెట్లను పట్టణ పోలీస్‌స్టేషన్లో అప్పగించి ఫిర్యాదు చేశారు. దాడుల్లో డీసీటీవో రామారావు, ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఆర్ఐ ఇంటూరి అనిల్‌కుమార్, వీఆర్వోలు ఆరుమాళ్ల నాగేశ్వరరావు, అందుగుల రాజారావు తదితరులు పాల్గొన్నారు.



సీజ్ చేసిన సిగరెట్లను పట్టణ పోలీస్‌స్టేషన్లో అప్పగిస్తున్న అధికారులు

కృష్ణానదిలో యువకుడి గల్లంతు



రాజేష్ (ఫైల్‌ఫొటో)

అమరావతి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అమరావతిలోని సాయిబాబా మందిరం సమీపంలోని కృష్ణానదిలో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు యువకుడు గల్లంతైన ఘటన మంగళవారం మధ్యాహ్నం జరిగింది. ప్రభుత్వ వైద్యశాల వెనుక వైపు ఉన్న కాలనీకి చెందిన నల్లకట్ల రాజేష్(19), మరో పదిమంది యువకులు కలిసి చేపలు పట్టుకుని స్నానం చేసేందుకు కృష్ణానదిలోకి వెళ్లారు. వీరిలో రాజేష్ నదిలో మునిగి గల్లంతవడంతో మిగిలిన వారు బయటకు వచ్చారు. గల్లంతైన యువకుడి ఆచూకీ కోసం రెవెన్యూ, పోలీసు అధికారుల ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు.

1,11,203 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 1,16,035 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,11,203 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 53,345 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			షార్క్-1	10500	12400
334	9500	13000	బ్యాడిగి 355	10000	13200
నంబరు. 5	10000	13400	సింజెంటా		
273	10000	12900	బ్యాడిగి 5531	10500	12200
341	10500	14000	దేవనూరు డీలక్స్	10300	12700
4884	10000	11900	ఆర్మూరు	10000	11500
సూపర్ 10	--	--	తాలుకాయలు	5000	6500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ					
తేజ	10300	13600			

కన్న కొడుకే కాలయముడయ్యాడు

◆ కూలి డబ్బు కోసం వేధిస్తున్నాడు
◆ కాపాడమని పోలీసులను ఆశ్రయించిన వృద్ధ దంపతులు



వరకుమారి, చంద్రశేఖర్ దంపతులు

వేమూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులకు అండగా ఉంటాడని, చివరి దశలో తలకొరివి పెడతాడని కొడుకుపై గంపెడాశలు పెట్టుకున్న ఆ వృద్ధ దంపతులకు ఇప్పుడు ప్రాణ భయం పట్టుకుంది. బాపట్ల జిల్లా, వేమూరు మండలం, పెరవలి గ్రామానికి చెందిన అమిరె వరకుమారి, చంద్రశేఖర్ వేమూరు పోలీస్‌స్టేషన్ వద్ద మంగళవారం విలేకర్లతో తమ గోడు వెళ్లబోసుకుని కన్నీటి పర్యంతమయ్యారు. తమ ఏకైక కుమారుడైన వీర బసవయ్య తమను బతికుండగానే చిత్రహింసల పాలు చేస్తూ చంపుతామని బెదిరిస్తున్నాడని, ప్రతినిత్యం తాగి వచ్చి తాము కూలి పనులు చేసుకున్న డబ్బులు ఇవ్వమని కొడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. కూలిపై ఆధారపడి జీవించే తాము బతుకుపై ఆశలు వదులుకునే పరిస్థితి ఏర్పడిందని, తమ కుమారుడిపై చర్యలు తీసుకోకపోతే తాము ఏ క్షణమైనా విగత జీవులవుతామన్నారు. న్యాయం జరుగుతుందనే చిరు ఆశతో ప్రాణభిక్ష కోసం పోలీసులను ఆశ్రయించామన్నారు. తమకు న్యాయం చేయాలని ఆ వృద్ధ దంపతులు వేమూరు పోలీసులను వేడుకున్నారు. ఈ విషయాన్ని విలేకరులు ఎస్ఐ దృష్టికి తీసుకురాగా విషయం తన దృష్టికి వచ్చిందని, విచారించి చర్యలు తీసుకుంటామని బాధితులకు తగు భద్రత కల్పిస్తామన్నారు.

గుంటూరు ఛానల్లో మునిగి యువకుడి మృతి



షేక్ జాని (ఫైల్)

పెదకాకాని, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లిన యువకుడు గుంటూరు ఛానల్లో మునిగి మృతిచెందిన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. పెదకాకాని పోలీసుల కథనం ప్రకారం ఆర్టీసీ కాలనీ సమీపంలోని క్రాంతి నగర్‌కు చెందిన షేక్ జాని(18) అతని స్నేహితులైన మహమూద్, వంశీ, లోకేశ్ లతో కలిసి సరదాగా ఈత కొట్టేందుకు గుంటూరు ఛానల్‌కి వెళ్లారు. అక్కడ నీటితో దిగిన క్రమంలో జాని మునిగిపోయాడు. పక్కనే ఉన్న స్నేహితులు కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ దొరకలేదు. కొద్దిసేపటికి మృతదేహాన్ని బయటికి తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని పోలీసులు తెలిపారు.

కొడుకును చంపిన తల్లి, తండ్రి అరెస్టు

ఫిరంగిపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఫిరంగిపురం గ్రామంలోని ప్రకాశం పంతులు కాలనీలో అద్దెకు ఉంటున్న కొండవీడు గ్రామస్థులైన కంచర్ల సాగర్, అతని రెండవ భార్య లక్ష్మీ తిరుపతమ్మ ఉరఫ్ లక్ష్మిలు కొడుకు కంచర్ల కార్తీక్‌ను గొంతు పిసికి చంపిన కేసులో తల్లిదండ్రులు ఇద్దరిని అరెస్టు చేశామని ఫిరంగిపురం పోలీసులు మంగళవారం తెలిపారు. నిందితులను మంగళవారం నరసరావుపేట రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎదుట హాజరుపరచగా వారిరువురికి ఈనెల 11వ తేదీ వరకు రిమాండ్ విధించినట్టు పోలీసులు తెలిపారు. కేసును సీఐ బీ రవీంద్రబాబు దర్యాప్తు చేస్తున్నారు.

నాలుగు రిటైల్ మందుల దుకాణాల లైసెన్స్‌ల రద్దు

● నర్సరావుపేటలో రూ.18.50 లక్షల మందుల సీజ్

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా గత పది రోజులుగా విజిలెన్స్ శాఖ, పోలీసు శాఖతో కలసి ఔషధ నియంత్రణ శాఖ అధికారులు చేపట్టిన తనిఖీలు కొనసాగుతున్నాయి. గుంటూరులో నాలుగు రిటైల్ మందుల దుకాణాలతో పాటు హోల్‌సేల్ మందుల దుకాణాలను అధికారులు తనిఖీలు చేశారు. హోల్‌సేల్‌షాపులో రికార్డులు సక్రమంగా ఉన్నట్లు గుర్తించారు. నాలుగు రిటైల్ మందుల షాపుల్లో రికార్డులు సరిగా లేకపోవంతో తాత్కాలికంగా ఆయా దుకాణాల లైసెన్స్‌లను వారం రోజుల పాటు రద్దు చేశారు. నర్సరావుపేటలో అనధికార గోడౌన్‌లో నిల్వ ఉంచిన రూ.18.50 లక్షల మందులను అధికారులు సీజ్ చేశారు. రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు "ఆపరేషన్ గరుడ" (ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లాఎన్‌ఫోర్స్‌మెంట్-ఈగల్) పేరిట మార్చి 21వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా మందుల దుకాణాలపై విజిలెన్స్ శాఖతో కలసి డ్రగ్ కంట్రోల్ అధికారులు ఆకస్మిక తనిఖీలు జరుపుతున్న విషయం తెలిసిందే. ఈ మత్తు మందులకు యువత బానిసలుగా మారుతున్నట్లు ఆరోపణలు రావడం, పలువురు రిటైల్ డ్రగ్గిస్టులు ఈ మందులను చట్టవిరుద్ధంగా విక్రయిస్తున్నట్లు ఆరోపణలు రావడంతో ఈ తనిఖీలు చేపట్టారు. దుకాణాలపై తనిఖీలు కొనసాగుతాయని గుంటూరు ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డీ లక్ష్మణ్ తెలిపారు.

అవనిగడ్డ ప్రమాదంపై పెమ్మసాని ఆరా..

గుంటూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ వద్ద రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందిన తెనాలివాసులు గిడుగు రవీంద్ర మోహన్ బాబు కుటుంబానికి పెమ్మసాని భరోసా ఇచ్చారు. ఢిల్లీలో ఉన్న ఆయన ప్రమాద ఘటన గురించి వార్తా కథనాల ద్వారా తెలుసుకుని మంగళవారం బాధితుల బంధువులకు ఫోన్ చేసి మాట్లాడారు. అధైర్యపడవద్దని వారికి ధైర్యం చెప్పారు. ప్రమాదఘటనపై, సత్వర చర్యలపై సబ్ కలెక్టర్ సంజనా సిన్హాకు పలు సూచనలు చేశారు. ఘటన జరగడానికి గల కారణాలను, అలాగే చికిత్స అందుతున్న విధానాన్ని వైద్యులను కూడా అడిగి తెలుసుకున్నారు. సందీప్, పల్లవిల ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని అయితే, తొడ ఎముకలకు ఫ్రాక్చర్ అయినందువల్ల సర్జరీ చేసే అవకాశం ఉందని ఆసుపత్రి వైద్యులు తెలిపారు. అనంతరం తెనాలిలోని బంధువులతో అక్కడి పరిస్థితిపై పెమ్మసాని ఆరా తీశారు. ప్రభుత్వం నుంచి సహకారం అందించేలా కృషి చేస్తానన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగింపు

గుంటూరు (విద్య), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఏపీ గురుకుల విద్యాలయాలు, మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగించినట్లు జిల్లా కన్వీనర్ ఐ. జయప్రకాష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5,6,7,8, తరగతుల్లో మిగిలి ఉన్న ఖాళీలకు, జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం, డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఈనెల 6వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. ఏపీఆర్ఎస్ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు. ఇతర వివరాల కోసం 87126 25073, 962569140లో సంప్రదించాలని సూచించారు.

73 మంది పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి

● పీఎస్ గ్రేడ్- 4 నుంచి గ్రేడ్- 3గా బాధ్యతలు

గుంటూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 73 మంది పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి లభించిందని జిల్లా పంచాయతీ అధికారి బీ సాయికుమార్ తెలిపారు. 73 మంది పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు కల్పించడం కోసం మంగళవారం గుంటూరులోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ జరిగింది. మొత్తం 73 మంది గ్రేడ్ -4 పంచాయతీ కార్యదర్శులు కౌన్సిలింగ్‌కు హాజరవగా వారిలో 53 మందికి గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి లభించింది. వారితోపాటు 21 మంది జూనియర్ అసిస్టెంట్లకు కూడా గ్రేడ్- 3 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి లభించింది.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారం నాటికి 519.10 అడుగులు ఉంది. ఇది 147.63 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 4050 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6870 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, ఔట్ ఫ్లో వాటర్‌గా 13,020 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 2926 క్యూసెక్కుల

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	158, 167, 178
చికెన్ విత్ స్కిన్(కిలో)	306.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	316.00

బాపట్ల వార్తలు

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా బంగారుబాబు

బాపట్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడిగా అద్దంకి పట్టణానికి చెందిన కొండముది బంగారుబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం కార్యవర్గ ఎన్నిక జరిగింది. రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, యడ్లపాటి స్వరూపరాణి, పులికృష్ణారెడ్డి, మువ్వల రమణ, జగన్నాధశాస్త్రి, హేమంతకుమార్‌ల సమక్షంలో నిర్వహించారు. కార్యక్రమానికి ప్రస్తుత అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించి బంగారుబాబు పేరును ప్రతిపాదించారు. దీనికి పార్టీశ్రేణులంతా అంగీకరించటంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ప్రకటించారు. నూతన అధ్యక్షుడు బంగారుబాబు మాట్లాడుతూ సీనియర్ నాయకుల సూచనలు, సలహాలు స్వీకరిస్తూ అందరిని కలుపుకొని వెళుతూ పార్టీని ముందుకు తీసుకెళతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బ్రహ్మండం బాలనారాయణ, మాజీ అధ్యక్షుడు మామిడి రమేష్‌కుమార్, సీనియర్ నాయకులు బి.బాబునాగేంద్ర, కొక్కిలిగడ్డ శ్రీనివాసరాజు, కరీముల్లా, శ్రీరామయ్య, కె.శ్రీనివాస్, జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.



బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన బంగారుబాబును సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడికి ఘనస్వాగతం

బాపట్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన తాండ్ర సాంబశివరావుకి బాపట్ల మాజీ సైనికులు, నల్లమోతువారిపాలెం గ్రామస్థులు పెద్దఎత్తున ఘనస్వాగతం పలికారు. భారీ ర్యాలీతో ఆయనను తీసుకొచ్చి ఘనంగా సత్కరించి సన్మానించారు. మహిళలు హారతులు పట్టారు. అనంతరం విజయలక్ష్మీపురంలో బాపట్ల జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘ కార్యాలయానికి చేరుకున్నారు. సంఘ సభ్యుల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తాండ్ర సాంబశివరావు తెలిపారు. బాపట్ల అసోసియేషన్ ఉపాధ్యక్షులు పుట్టా ఆదిశేషారెడ్డి, సెక్రటరి షేక్ కరీముల్లా, జాయింట్ సెక్రటరి ఆసోది రామకృష్ణారెడ్డి, కోశాధికారి పువ్వాడ యలమంద, ఉమ్మడి జిల్లా కో ఆర్డినేషన్ కమిటీ అధ్యక్షుడు సుంకర శేషగిరి, ముఖ్యసలహాదారుడు తోట దుర్గారావు, షేక్ నిజాముద్దీన్, సీహెచ్‌వీ కృష్ణారావు పాల్గొన్నారు.



తాండ్ర సాంబశివరావును సన్మానిస్తున్న మాజీ సైనికులు, నల్లమోతువారిపాలెం గ్రామస్థులు

నేడు కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం : ఫ్యాప్టో

బాపట్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : హామీలు నెరవేర్చాలని కోరుతూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఛైర్మన్, కార్యదర్శి శేఖర్‌బాబు, పిచ్చయ్య తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్థిక ప్రయోజనాలకు గండిపడిందని ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళగా అన్నిరకాల బకాయిలు చెల్లిస్తామని, 12వ వేతన సవరణ కమిషన్ నియమిస్తామని, ఐఆర్ ప్రకటిస్తామని హామీనిచ్చి అమలు చేయలేదన్నారు. వీటిని వెంటనే అమలు చేసి పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్త కార్యక్రమంలో భాగంగా నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఇంటి, నీటి పన్నుల వసూళ్ళు పూర్తి చేయాలి

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 14 గ్రామపంచాయతీలకు చెందిన కార్యదర్శులు 2024-2025 సంవత్సరానికి సంబంధించిన ఇంటి, నీటి పన్నులు ఈనెల 10వ తేదీకల్లా ఎంపీడీవో ఐ.సత్యనారాయణరావు ఆదేశాల మేరకు పూర్తి చేయాలని ఈవోపీఆర్డీ ఎ.ఏలీషాబాబు తెలిపారు. ఈ ఏడాది పన్నులతో పాటు గత బకాయిలు ఉంటే వాటిని కూడా పూర్తి స్థాయిలో వసూళ్ళు చేయాలని గ్రామపంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు.

ఆన్‌లైన్ ముగ్గుల పోటీలో భార్గవికి ఐదో బహుమతి

కర్లపాలెం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్, అమెరికా అసోసియేషన్ ఆధ్వర్యంలో యూఎస్‌ఏలో ఆన్‌లైన్ సంక్రాంతి ముగ్గులు పోటీలు నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలలో యజలి గ్రామానికి చెందిన లుక్కా భార్గవి 5వ బహుమతి గెలుచుకొని రూ.2 లక్షల ప్రైజు మనీ పొందింది. ఈ ఆన్‌లైన్ ముగ్గుల పోటీలో 30 వేల మంది పాల్గొన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా భార్గవిని యాజలి టీడీపీ అధ్యక్షుడు దామర్ల సూర్యనారాయణ, వీరరాఘవయ్య, గ్రామయువత అభినందించారు.



భార్గవిని అభినందిస్తున్న యాజలి గ్రామ టీడీపీ అధ్యక్షుడు సూర్యనారాయణ తదితరులు

4న మండల సర్వసభ్య సమావేశం

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 4వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు పిట్టలవానిపాలెం మండల పరిషత్ అధ్యక్షుడు దెందుకూరి సీతారామరాజు అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో ఐ.సత్యనారాయణరావు తెలిపారు. మండలస్థాయి అధికారులు, ఎంపీటీసీలు, గ్రామపంచాయతీల సర్పంచ్‌లు తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమావేశం జరుగుతుందని, అధికారులు సమగ్ర సమాచారంతో హాజరుకావాలని ఆయన కోరారు.

జనసేన పార్టీలో చేరిన వైసీపీ నాయకుడు

బాపట్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : బాపట్లకి చెందిన వైసీపీ నాయకుడు, న్యాయవాది బండిరామ్మూర్తినాయుడు ఆయన తనయుడితో కలిసి మంగళవారం జనసేన పార్టీలో చేరాడు. ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు సమక్షంలో మంగళవారం పార్టీలో చేరిన ఆయనకు కండువాలు కప్పి గజమాలతో సత్కరించారు. జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బండి రాకేష్, ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి గుంటుపల్లి తులసీకుమారి, సీనియర్ నాయకులు విన్నకోట సురేష్, కర్లపాలెం మండల పార్టీ అధ్యక్షుడు గొట్టిపాటి శ్రీకృష్ణ, పట్టణనాయకులు కారుమూరి అంజనేష్, దాసరి వినోద్, తిరుమలశెట్టి సాగర్, పెద్దినాగు, బుల్లియ్య పాల్గొన్నారు.

కాల్వలోకి వెళ్లిన మరో కారు



కాల్వలో పడిన కార్లు

అమృతలూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని తెనాలి-చందోలు ప్రధాన రహదారిలో పెదపూడి వంతెన వద్ద నిజాంపట్నం కాల్వ వంతెన నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ వంతెన వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా ఆర్ అండ్ బీ అధికారుల నిర్లక్ష్యం కారణంతో ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ప్రజల ప్రాణాలకు వీరు ఇస్తున్న విలువా ఇదేనా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ సోమవారం ఒక కారు ప్రమాదవశాత్తు కాల్వలో పడిన సంఘటన విదితమే. కాగా మంగళవారం వేకువజామున మరో కారు ఇదే ప్రాంతంలో నిజాంపట్నం కాల్వలో పడింది. ఇక్కడ వంతెన రెయిలింగ్ లేకపోవడంతోపాటు, మలుపు ఉండటంతో కొత్తవారికి ఇబ్బందికరంగా మారింది. దీనికి తోడు ఇక్కడ రహదారి కొద్ది దూరం వరకు డబుల్ లైన్‌గా అభివృద్ధి చేశారు. దీంతో వాహనదారులు రహదారి అభివృద్ధి చేసి ఉండటంతో పొంచి ఉన్న ప్రమాదాన్ని గమనించడం లేదు. దీంతో ఇక్కడ నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో పలుమార్లు ప్రమాదాలు జరిగినా అధికారుల నుంచి స్పందన లేదు. కనీసం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయడంతోపాటు రేడియల్ స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



బాపట్ల గడియార స్తంభం సెంటర్ నుంచి సూర్యలంక రోడ్డులోని ఆంజనేయస్వామి దేవాలయం వరకు నిలిచిపోయిన ట్రాఫిక్‌తో బారులు తీరిన వాహనాలు

పట్టణాన్ని పీడిస్తున్న ట్రాఫిక్ సమస్య

- వన్‌వే ఉన్నా జీబీసీ రోడ్డుపైనే వాహనాలు
- పోలీసులకు సైతం సవాల్‌గా మారుతున్న సమస్య

బాపట్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పట్టణాన్ని ట్రాఫిక్ సమస్య పట్టిపీడిస్తున్నది. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రతి రోడ్డు ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్యతో తల్లడిల్లిపోతున్నాయి. ముఖ్యంగా జీబీసీ రోడ్డులోని స్టేట్‌బ్యాంక్ పక్కగా వన్‌వేరోడ్డు ఏర్పాటు చేసినప్పటికి చీరాల వైపు నుంచి వచ్చే వాహనాలు కూడా గడియార స్తంభం మీదగానే వస్తున్నాయి. దీనిని పోలీసులు నియంత్రించలేకపోతున్నారు. దీనివల్ల వాహనాల రద్దీ పెరిగి ప్రమాదాలు జరగటం పరిపాటిగా మారింది. మంగళవారం మధ్యాహ్నం గడియారస్తంభం సెంటర్ దగ్గర నుంచి ఆంజనేయస్వామి దేవాలయం వరకు ట్రాఫిక్ పెద్దఎత్తున నిలిచిపోయింది. సూర్యలంక వైపు నుంచి వచ్చే వాహనాలు గతంలో ఆంజనేయస్వామి దేవాలయం దగ్గర నుంచి భీమావారిపాలెం మీదగా పాతబస్టాండ్‌కు మళ్ళించేవారు. ప్రస్తుతం అటువాహనాలు కూడా గడియారస్తంభం వైపు రావటం వల్ల ఎదురెదురు వాహనాలతో ట్రాఫిక్ స్తంభించిపోయి సమస్య తలెత్తుతుంది. దీనికితోడు ఈరోడ్డుపై సాయంత్రం వేళల్లో స్నేక్‌డ్రైవ్ చేస్తూ యువకులు భయపెడుతున్నారు. రోడ్డు విస్తరించినప్పటికి రోడ్లమీదే వాహనాలు, తోపుడుబండ్లు పెట్టటం వల్ల రాకపోకలకు విఘాతం ఏర్పడుతున్నది. రథంబజారులో పెద్దఎత్తున వాహనాలు పార్కింగ్ చేయటంతోపాటు గుంపుగుంపులుగా జనం చేరటం వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడుతున్నది. అంబేద్కర్ సర్కిల్‌లో ఆర్‌వోబి పై నుంచి వచ్చే వాహనాలకు ఎదురెదురు వాహనాలు వస్తూ ప్రమాదాలకు గురిచేస్తున్నాయి. అంబేద్కర్ విగ్రహానికి ఒకవైపు బ్రిడ్జిపైకి వెళ్ళేవాహనాలు, మరోవైపు బ్రిడ్జిపై నుంచి కిందకు వాహనాలు వచ్చే ఏర్పాట్లు చేస్తే సమస్య ఉండదు. ఇక్కడ ట్రాఫిక్ సమస్యను గాలికి వదిలేయటంతో ఎదురెదురు వాహనాలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో ఇక్కడ రెండుచోట్ల ఔట్‌పోస్ట్‌లు ఉండేవి. ప్రస్తుతం ట్రాఫిక్ సిబ్బంది కూడా కనిపించటంలేదు. ఔట్‌పోస్ట్‌ల ఆచూకీ లేకుండాపోయింది.

పాతబస్టాండ్ కూడలిలో రోడ్లపైనే ఆటోలు, దుకాణాలు ఏర్పాటు చేయటం వల్ల నిత్యం ట్రాఫిక్ సమస్య, ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ఓ మహిళను లారీ ఢీకొట్టటంతో నడిరోడ్డుపై మృతి చెందింది. వాహనచోదకులు నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా నడపటం, అడ్డుచెప్పేవారు లేకపోవటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయనే విమర్శలు సర్వత్రా వ్యక్తమౌతున్నాయి. సంబంధిత పోలీసుఅధికారులు దీనిపై దృష్టిసారించి వన్‌వే రోడ్డు ద్వారా వాహనాలు మళ్ళించి ముఖ్యకూడలిలో ట్రాఫిక్ పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం వాహనాలు నడిపేవిధంగా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ప్రజల నమ్మకాన్ని వమ్ము కానివ్వం

- పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే ఆనందబాబు



దోనేపూడిలో ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు ఎంతో నమ్మకంతో తమకు అధికారాన్ని కట్టబెట్టారని దానిని వమ్ము కానివ్వమంటూ ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. మండల పరిధిలోని దోనేపూడిలో ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంగళవారం ఎమ్మెల్యే పాల్గొని ఇంటింటికి తిరిగి పింఛన్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ, గత ఐదేళ్లలో రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం విధ్వంసం సృష్టించిందని, తద్వారా రాష్ట్రం 20 ఏళ్లు తిరోగమనంలోకి వెళ్లిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. అమరావతి, పోలవరం పునాదులతో సహా మొదలు పెట్టాల్సిన పరిస్థితి వైసీపీ ప్రభుత్వం కల్పించిందన్నారు. వైసీపీ విధ్వంసకర పాలనతో విసుగెత్తిన ప్రజలు కూటమికి తిరుగులేని విజయంతో అధికారం అప్పగించారని, అధికారం, ప్రజా సంక్షేమం దృష్టిలో పెట్టుకుని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో చంద్రబాబు నడిపించేందుకు నడుం కట్టారన్నారు. దెబ్బతిన్న రహదారులను మళ్లీ పునః నిర్మించే పనిలో ప్రభుత్వం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఝైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్, సంగం డెయిరీ డైరెక్టర్ జీఎల్‌జి భగవాన్, పార్టీ నాయకులు వెనిగళ్ల మహేష్, నిమ్మగడ్డ అనిల్ బాబు, పెదపూడి నాగరాజు, ఎడ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వితంతు పింఛన్లు పంపిణీ

నూతనంగా మంజూరైన వితంతు పింఛన్ల మండల టీడీపీ అధ్యక్షులు ఝైనేని మురళీకృష్ణ పంపిణీ చేశారు. కొల్లూరు ఎస్సీ కాలనీకి చెందిన చొప్పర జయమ్మ, సిద్దెల కన్నమ్మ, నిడమానూరు వెంకటలక్ష్మి భర్తలు చనిపోవడంతో వితంతు పింఛన్లకు దరఖాస్తులు చేసుకున్నారు. ఆ ముగ్గురికి అధికారులు వెంటనే పింఛన్లు మంజూరు చేయడంతో వాటిని మురళీకృష్ణ పంపిణీ చేసి మాట్లాడుతూ, గతంలో వితంతు పింఛన్లు కోసం దరఖాస్తుదారులు కార్యాలయాల చుట్టూ తిరిగాల్సి వచ్చేదని, ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వితంతు పింఛన్లను భర్త చనిపోయిన 15 రోజుల్లోనే అందజేయడం హర్షించదగ్గ పరిణామమని ఆయన అన్నారు.

పెన్షన్‌లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే వేగేశన



పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, కూటమి నాయకులు

బాపట్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో మంగళవారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి పట్టణంలోని 11, 14, 16వ వార్డులలో ఇంటింటికెళ్ళి లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు. దేవుడి మాన్యం, తుఫాన్‌నగర్, తాలింఖాన్ దగ్గర పెన్షన్లు పంపిణీ చేసి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతినెల 1వ తేదిన ఇంటి వద్దకు వచ్చి పెన్షన్లు ఇస్తున్నట్లు చెప్పారు. అర్హత గల ప్రతి ఒక్కరికి పెన్షన్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీరాల గోవర్ధనరెడ్డి, సూరగాని శేఖర్, మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ జిట్టా ప్రమీలారాణి, మాజీ కౌన్సిలర్ జిట్టా కన్యాకుమారి, జనసేన కార్యదర్శి గుంటుపల్లి తులసీకుమారి, సీనియర్ నాయకులు నర్రా వీరాంజనేయులు, సురేష్, భీమా కోటేశ్వరరావు, పసుపులేటి శివ, కొటికలపూడి నాగేశ్వరరావు, సుబ్బారావు, మందపాటి ఆంత్రేయ, శీలం శ్రీనివాసరావు, భీమా లీలాకృష్ణ, జిట్టా శ్రీనివాసరావు, అంజనేష్, రాఘవేంద్ర, రాణి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



నందిరాజుతోటలో లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేస్తున్న తాతా జయప్రకాష్‌నారాయణ తదితరులు

● బాపట్ల మండలంలోని నందిరాజుతోట గ్రామంలో మంగళవారం సామాజిక భద్రత పెన్షన్లను టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణ పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బంది, పార్టీ శ్రేణులతో కలిసి లబ్ధిదారుల ఇళ్ళ వద్ద కెళ్ళి పెన్షన్లు అందజేసి భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో సంగం డెయిరీ డైరెక్టర్ మరీదు వెంకటేశ్వరరావు, సచివాలయసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● కొండుభొట్లపాలెం గ్రామంలో టీడీపీ పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజినీ పార్టీశ్రేణులతో కలిసి పెన్షన్లు పంపిణీ చేశారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాబురావు, గ్రామ కార్యదర్శి ఝాన్సీరాణి, పార్టీ శ్రేణులు నక్కా రోశయ్య, పల్లం జీవన్, లూధియా, మార్పు ప్రతాప్, పసుమర్తి ఆనందబాబు, కొండలు పాల్గొన్నారు.

● పేదలకు అండగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు ఉన్నాయని టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు కాగిత నాగభూషణమ్మ అన్నారు. మండలంలోని ఈతేరు గ్రామ పంచాయతీ పరిధిలో పార్టీశ్రేణులతో కలిసి సామాజిక భద్రతా పెన్షన్లు ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● రేపల్లె, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. పట్టణంలోని పలువార్డుల్లో మంగళవారం వృద్ధాప్య, వింతువు, దివ్యాంగ పెన్షన్‌లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి అనగాని సత్యప్రసాద్ పురపాలకసంఘం అభివృద్ధి కోసం రూ.4 కోట్ల నిధులు మంజూరు చేయించారని, వాటి ద్వారా చంద్రమౌళిపార్కు, గ్రంథాలయం, మున్సిపల్ గెస్ట్‌హౌస్, సీసీ రహదారులు అభివృద్ధి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఎక్కువ మంది అర్హత ఉండి పెన్షన్‌లు కావాలని కోరుతున్నారని, త్వరలో పెన్షన్‌లు మంజూరు చేసే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు, టీడీపీ నాయకులు దున్నా జయప్రద, నల్లూరు అజయ్‌కుమార్, కరేటి కోటి, బి.సత్యనారాయణ, కేసన నరసింహ తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి సోదరుడు శివప్రసాద్

● పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 14 గ్రామపంచాయతీలలో మండలస్థాయి అధికారులు, కూటమి నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం పెన్షన్‌దారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లను పంపిణీ చేశారు. చందోలు గ్రామపంచాయతీలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎండీ అఫ్జల్, అధికారులు, గ్రామసచివాలయాల ఉద్యోగులతో కలిసి పెన్షన్‌లు పంపిణీ చేశారు.

● కర్లపాలెం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెం గ్రామంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ సూచనలతో ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు వృద్ధులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు మాడా శ్రీనివాసరావు, టీడీపీ, జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు మునిపల్లి చిన్న, గరిగంటి శ్రీనివాసరావు, దొడ్డా వెంకటరామారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అదేవిధంగా కర్లపాలెం పంచాయతీ రామాలయం రోడ్డులో వృద్ధులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కర్లపాలెం మండలం ఎట్రావారిపాలెం గ్రామంలో వృద్ధులకు ఎన్టీఆర్ భరోసా నూతన పెన్షన్‌లను గ్రామసర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, తుమ్మా గోవర్ధనరెడ్డి, చీరాల లీలాకృష్ణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. కర్లపాలెం మండలం చింతాయపాలెంలో పెన్షన్‌దారులకు మంగళవారం గ్రామసర్పంచ్ పీట శ్రీనివాసరావు పంపిణీ చేశారు.



పెన్షన్‌లను పంపిణీ చేస్తున్న ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు తదితరులు

కూటమి పాలనలో పంచాయతీలకు నిధులు

- ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

వేమూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి పాలన ద్వారా గ్రామాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని గ్రామ పంచాయతీలకు ప్రత్యేకంగా నిధులను కేటాయించడం జరుగుతుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. వేమూరు గ్రామ పంచాయతీ వద్ద పంచాయతీ కార్మికులకు ప్రభుత్వ నిధులతో సమకూర్చిన చెత్త సేకరణ బండ్లను మంగళవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత జగన్ ప్రభుత్వంలో పంచాయతీ నిధులతో పాటు ఉపాధి పనులు, అలాగే ఇతరమైన కేంద్ర ప్రభుత్వ నిధులను కూడా దారి మళ్లించి వాటిని తాడేపల్లి ప్యాలెస్ ఖాతాలోకి వేసుకున్నారని విమర్శించారు. తద్వారా గ్రామాలు ఏమాత్రం అభివృద్ధి చెందకపోగా కనీసం పారిశుద్య చర్యలు కూడా లేక అపరిశుభ్ర వాతావరణాన్ని సంతరించుకున్నాయన్నారు. కనీసం కార్మికులకు వేతనాలు కూడా చెల్లించలేదని అన్నారు. కూటమి పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి, పంచాయితీరాజ్ శాఖ మంత్రిగా వ్యవహరిస్తున్న పవన్‌కళ్యాణ్ గ్రామాల సంక్షేమం కోసం ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. కొత్తగా మంజూరైన వితంతు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటరీ స్థాయి అధికారి ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, సర్పంచ్ సజ్జా శ్రీలక్ష్మీతిరుపతమ్మ, తహసీల్దార్ సుశీల, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఊసా రాజేష్, ఈవోపీఆర్డీ శేఖర్, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి నవరాణి, సచివాలయాల సిబ్బంది, కార్మికులు, టీడీపీ నాయకులు మన్నె పని, యలవర్తి సురేంద్ర, బండారు సూరిబాబు, కోగంటి రాజేష్, కోగంటి గోపీనాథ్, అన్నే ప్రసాద్, కొండ్రు బుల్లియ్య, పిల్లి మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



వేమూరులో పంచాయతీ కార్మికులకు చెత్త సేకరణ బండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

ఖరీఫ్ నాటికి సాగునీటి కాల్వల ఆధునికీకరణ

- సాగునీటి సంఘాల డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్ రాధాకృష్ణమూర్తి

చెరుకుపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : వచ్చే ఖరీఫ్ కాలం నాటికి మండలంలోని సాగు, మురుగునీటి కాలువలలో పూడికతీసి ఆధునీకరిస్తామని సాగునీటి సంఘాల డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్ ఎం.రాధాకృష్ణమూర్తి అన్నారు. కావూరు ఓల్డ్‌కోర్స్ డ్రెయిన్‌లో పూడికతీత పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. వర్షాకాలంలో మురుగునీటి పారుదలకు ఆటంకం ఏర్పడుతుందని, దాన్ని తొలగించేందుకు ప్రభుత్వం రూ.11 లక్షలు కేటాయించిందని అన్నారు. రెండు కిలోమీటర్ల పొడవునా కాలువలో పూడికతీత యంత్ర సాయంతో చేపట్టామన్నారు. ఖరీఫ్ నాటికి పనులు పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గోవాడ సాగునీటి సంఘం అధ్యక్షుడు కొడాలి సత్యనారాయణ, ఆరుంబాక సాగునీటి సంఘం ఉపాధ్యక్షుడు సుఖవాసి వాసు, తుమ్మల శ్రీకాంత్, గొట్టిపాటి వీరయ్యచౌదరి, గడ్డిపాటి వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఓల్డ్ కోర్స్ డ్రెయిన్‌లో పూడికతీత పనులను పరిశీలిస్తున్న రాధాకృష్ణమూర్తి తదితరులు

ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు

వేమూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేమూరు, పెరవలి పరీక్ష కేంద్రాలలో ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు మంగళవారం చివరి రోజు సోషల్ పరీక్షతో ప్రశాంతంగా ముగిశాయి. 208 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 204 మంది హాజరయ్యారు. నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. పెరవలి కేంద్రంలో 65 మందికి గాను పూర్తి హాజరయ్యారు. వేమూరు కేంద్రంలో 143 మందికి 139 మంది హాజరుకావడంతో ఇక్కడ నలుగురు గైర్హాజరైనట్లు పరీక్షా అధికారి తెలిపారు.

పరీక్ష కేంద్రాలను సందర్శించిన జిల్లా అబ్జర్వర్

రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన పథకం జాయింట్ డైరెక్టర్, పదవ తరగతి పరీక్షల బాపట్ల జిల్లా అబ్జర్వర్ గంగాభవాని మంగళవారం పదో తరగతి పరీక్ష కేంద్రాలను సందర్శించారు. సోషల్ పరీక్ష చివరి రోజు కావడంతో ఆమె కేంద్రాలలో విద్యార్థులు పరీక్ష రాస్తున్న తీరు, సిబ్బంది వ్యవహరిస్తున్న విధానాలను పరిశీలించారు. నియోజకవర్గంలోని వేమూరు, కొల్లూరు, వెల్లటూరు కేంద్రాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తపరిచారు.

కొల్లూరులో...



కొల్లూరులో పదో తరగతి సోషల్ పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

కొల్లూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షలు మంగళవారం ముగిశాయి. సోమవారం రంజాన్ పర్వది నం కావడంతో పదో తరగతి సోషల్ పరీక్షను వాయిదా వేసి మంగళవారం నిర్వహించారు. మధ్యాహ్నం 12.45 గంటలకు పరీక్ష సమయం పూర్తి కావడంతో విద్యార్థులు పరీక్ష కేంద్రాల నుంచి ఎంతో ఉత్సాహం, సంతోషంతో బయటకు వచ్చి స్నేహితులతో కేరింతలు కొట్టారు. ప్రైవేట్ విద్యా సంస్థల యజమానులు తమ విద్యార్థులను వాహనాల ద్వారా విద్యా సంస్థలకు తీసుకు వెళ్లారు.

చెరుకుపల్లిలో...

చెరుకుపల్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : సోషల్‌పరీక్షతో 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముగిశాయని ఎంఈవో లాజర్ ఒక ప్రకటనలో తెలిపారు. సోషల్ పరీక్షకు 43 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. గవర్నమెంట్ హైస్కూల్ కావూరులో 22 మంది, జడ్పీహెచ్ఎస్ చెరుకుపల్లిలో 4, జడ్పీహెచ్ఎస్ గుళ్ళపల్లిలో 10 మంది, వనజాచంద్రపబ్లిక్‌స్కూల్ గూడవల్లిలో 7 గైర్హాజరయ్యారని తెలిపారు.

పిట్టలవానిపాలెంలో...

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు, మంతెనవారిపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలు, పిట్టలవానిపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ముగిశాయని మండల విద్యాశాఖాధికారి-2 కె.రాజారత్నం తెలిపారు. ఈ పరీక్షా కేంద్రాలలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు 341 మంది పరీక్షలు రాశారని తెలిపారు.

ఆటో, స్కూటీ ఢీ : ఇద్దరికి స్వల్ప గాయాలు

బాపట్ల రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : స్కూటీని ఆటో ఢీకొన్న ఘటనలో ఇద్దరికి స్వల్పగాయాలైన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. చీరాల నుంచిబాపట్ల వైపునకు వెళుతున్న ఆటో బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల వద్ద స్కూటీని ఢీకొట్టింది. ఈ ఘటనలో స్కూటీపై వెళుతున్న ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి.

సూర్యలంకలో సందడి

దీక్షల ముగింపుతో తీరానికి పోటెత్తిన ముస్లింలు


సూర్యలంక సముద్రతీరంలో స్నానాలు ఆచరిస్తున్న ముస్లిం సోదరులు, కుటుంబ సభ్యులు


చిన్నారులతో ముస్లిం పెద్ద


ఇసుకతో ఆటలాడుతున్న యువకులు


గజఈతగాళ్లతో గస్తీ నిర్వహిస్తున్న మెరైన్, రూరల్ పోలీసులు

బాపట్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న సూర్యలంక సముద్రతీరం మంగళవారం ముస్లిం సోదరులతో పోటెత్తింది. నెలరోజులుగా ఉపవాసదీక్షలు చేసి రంజాన్ వేడుకను ఘనంగా జరుపుకున్న ముస్లింకుటుంబాలంతా కలిసి తీరానికి వచ్చి పుణ్యస్నానాలు ఆచరిస్తూ సంతోషంగా, సరదాగా గడిపారు. బాపట్ల పరిసరప్రాంతాలు నుంచే కాకుండా రెండు తెలుగురాష్ట్రాల నుంచి విచ్చేసిన భక్తులతో తీరం కిక్కిరిసింది. ఇసుక తిమ్మెర్లతో యువత ఆటలాడుతూ సందడి చేశారు. చిన్నారులను సైతం స్నానాలు చేయిస్తూ పెద్దలు కనిపించారు. ప్రత్యేక వాహనాలలో తరలి రావటంతో తీరం వెంట బారులు తీరి జనం ఉన్నారు. సుమారు 60వేలమంది వచ్చిఉంటారని పంచాయతీ అధికారులు పేర్కొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పర్యాటకులు వస్తూనే ఉన్నారన్నారు. వాహనాల రాకపోకలతో అక్కడక్కడ కొన్ని అవాంతరాలు తలెత్తాయి. ట్రాఫిక్ సమస్యలు ఏర్పడ్డాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మెరైన్, రూరల్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గజ ఈతగాళ్ళ గస్తీ నిర్వహించి ప్రమాదాలు జరగకుండా చూశారు. గ్రామపంచాయతీ అధికారులు పర్యాటకులకు వసతులు కల్పించారు. తీరానికి విచ్చేసిన ముస్లిం సోదరులంతా కలిసి తీరం వెంట భోజనాలు చేసి సంతోషంగా గడిపారు. ప్రతి ఏడాది రంజాన్ వేడుక మరుసటి రోజు తీరానికి పర్యాటకులు రావటం పరిపాటిగా మారింది. ఈఏడాది అనుకున్న దానికన్నా ఎక్కువ సంఖ్యలో ముస్లిం సోదరులు తీరానికి తరలి వచ్చారు.

24 గంటలూ అందుబాట్లో ఆర్థోపెడిక్ ఓటీ

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వైద్య కళాశాల 1999వ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల వితరణతో ప్రభుత్వ సమగ్రాస్పత్రి ఆర్థోపెడిక్ విభాగంలో నూత నంగా ఏర్పాటు చేసిన ఆపరేషన్ థియేటర్‌ను రూ.లక్షన్నరతో అభివృద్ధి


ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభిస్తున్న రమణ యశస్వి

చేశారు. రూ.లక్షతో వైద్యపరికరాలను సమకూర్చారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడి చికిత్స కోసం వచ్చే రోగులకు ఆర్థోపెడిక్ విభాగంలో ఈ ఆపరేషన్ థియేటర్ 24 గంటలూ అందుబాట్లో ఉంటుందని ఆర్థోపెడిక్ ప్రొఫెసర్, సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. కార్యక్రమంలో ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ వీవీ నారాయణరావు, మత్తు విభాగాధిపతి డాక్టర్ పోలయ్య, ఎన్టీఆర్ వైద్య సేవ నోడల్ అధికారి డాక్టర్ అనిల్ పాల్గొన్నారు.

ఫిజియాలజీ లెక్చర్ గ్యాలరీ హాల్ ఆధునికీకరణ...

గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థి, న్యూరోసర్జన్ డాక్టర్ ఉప్పుటూరి హేమంత్ జీఎంసీ ఫిజియాలజీ విభాగంలో లెక్చర్ గ్యాలరీ హాల్ ఆధునికీకరణకు తగిన ఆర్థిక సాయం చేసేందుకు ముందుకు వచ్చారు. ఇక్కడ వైద్య విద్యను అభ్యసించిన సమయంలో డాక్టర్ హేమంత్ ఫిజియాలజీ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించారు. ఈ నేపథ్యంలో ఈ విభాగం అభివృద్ధికి సాయం చేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారి కోరగా, డాక్టర్ హేమంత్ అంగీకరించారు. ఇప్పటికే ఫిజియాలజీ లెక్చర్ గ్యాలరీ హాల్‌లో అభివృద్ధి పనులు చేపట్టారు.

క్యాంటీన్ పనుల ప్రారంభం...

గుంటూరు వైద్య కళాశాలలో విద్యార్థులకు, వైద్య బోధన సిబ్బంది కోసం ఆధునిక రీతిలో క్యాంటీన్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినం నాడు ప్రిన్సిపాల్ సుందరాచారి పూజా కార్యక్రమాలతో నిర్మాణ పనులను ప్రారంభించారు. సుమారు రూ.40 లక్షలతో చేపడుతున్న ఈ క్యాంటీన్ నిర్మాణానికి 1993వ బ్యాచ్ పూర్వ విద్యార్థి, ప్రముఖ స్పైన్ సర్జన్ డాక్టర్ జే నరేష్‌బాబు వ్యక్తిగతంగా రూ.25 లక్షల ఆర్థిక సాయం అందజేస్తున్నారు.

అతిగా పురుగు మందుల వాడకం అనర్థం

● ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయ ఏడీఆర్ డాక్టర్ దుర్గాప్రసాదు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పంటలో ఇష్టాను సారంగా పురుగుమందులు వినియోగించడంతో సరైన ఫలసాయం అందకపోగా ఖర్చు పెరుగుతుందని ఆచార్య ఎన్జీ రంగా విశ్వావిద్యా లయం అసిస్టెంట్ డైరక్టర్ ఆఫ్ రిసెర్చ్(ఏ డి ఆర్) డాక్టర్ దుర్గాప్రసాదు అన్నారు. మంగళవారం ఎన్విరో ఈక్విటీ హెల్త్ ఇనిషియేటివ్ స్వచ్ఛంద సేవా సంస్థ, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో రూరల్ మండలం జొన్నలగడ్డ గ్రామ రైతులకు పురుగు మందులు 'సురక్షితంగా వాడండి- ఆరోగ్యంగా ఉండండి' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు జొన్నకూటి శ్రీయ, వ్యవసాయ శాస్త్రవేత్తలు సాంబశివరావు, దయానాతో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాదు మాట్లాడుతూ దిగుబడుల కోసం పురుగు మందుల వాడకం పెరిగిపోయిందని చెప్పారు. మిగిలిన దేశాల్లో సమగ్ర సస్యరక్షణ పాటిస్తారని, మన దేశంలో మాత్రం ఎలాంటి జాగ్రత్తలు పాటించకుండా పురుగుమందులు వాడుతున్నారని చెప్పారు. వ్యవసాయ రంగంలో త్వరలో డ్రోన్ టెక్నాలజీ రానుందని వెల్లడించారు. జొన్నకూటి శ్రీయ మాట్లాడుతూ పురుగు మందులు వాడకంలో జాగ్రత్తలు


మాట్లాడుతున్న డాక్టర్ దుర్గాప్రసాదు, పాల్గొన్న జొన్నకూటి శ్రీయ, వంగా నవీన్‌రెడ్డి తదితరులు

తీసుకోని పక్షంలో క్యాన్సర్, అలర్జీ, మెదడు, నరాల సంబంధమైన జబ్బులు తోపాటు గర్భంలో బిడ్డలకు కూడా ప్రమాదం పొంచి ఉందన్నారు. పురుగు మందులు వాడిన అనంతం డబ్బాలు భూమిలో పాతిపెట్టాలన్నారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ మాజీ ఉపసర్పంచ్ వంగా నవీన్ రెడ్డి, లాం జనసేన పార్టీ నాయకులు ఎం సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇటుక పరిశ్రమకు గడ్డు పరిస్థితులు

కొల్లూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి రాష్ట్రంలో కొల్లూరు ఇటుక పరిశ్రమ ఎంతో ప్రసిద్ధి చెందింది. కొల్లూరు మండల పరిధిలోని కృష్ణానది పరివాహక ప్రాంతంలో దొరికే బుసకతో కూడిన మట్టి ఇటుక తయారీకి అనుకూలమైనది కావడంతో ఇక్కడ తయారయ్యే ఇటుకలు ఎంతో మన్నిక కలవని పేరు పొందాయి. అలాంటి పరిశ్రమ నేడు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటుంది. గతంలో ఈ ప్రాంతంలో సుమారు 180 ఇటుక పరిశ్రమలు ఉండగా నేడు అవి సగానికి పడిపోయాయి. ఇటుక తయారీకి వ్యయం పెరగడంతో పాటు అదే సమయంలో ఇటుక ధరలు తగ్గడంతో వ్యాపారులు నష్టాల పాలవడంతో ఈ ఏడాది ఇటుక ఉత్పత్తిని తగ్గించేశారు. కొల్లూరు ఇటుక


కొల్లూరు మండలంలో ఇటుక ఉత్పత్తి చేస్తున్న కార్మికులు

పరిశ్రమలలో ప్రతి ఏటా డిసెంబరు నుంచి మే వరకు ఇటుక తయారీ జరుగుతుంది. ఇటుక తీసేందుకు నెల్లూరు, ప్రకాశంతో పాటు విశాఖ, రాజమండ్రి, శ్రీకాకుళం జిల్లాల నుంచి కూలీలు తమ కుటుంబాలతో ఇక్కడకు వలస వచ్చి ఆరు నెలల పాటు ఇటుక బట్టీల వద్ద తమ నివాసాన్ని ఏర్పరచుకుంటారు. వీరితో పాటు స్థానికంగా ఉన్న మండల గ్రామాలతో పాటు భట్టిప్రోలు, వేమూరు మండలాల నుంచి కూడా ఇటుక పరిశ్రమలలో పనులు చేసేందుకు నిత్యం వందలాది మంది కూలీలు వచ్చి ఉపాధి పొందుతారు. ఈ ఏడాది ఇటుక ధరలు తగ్గిపోవడంతో పాటు గత ఏడాది తయారు చేసిన ఇటుకలు కూడా అమ్ముడు కాకపోవడంతో పరిశ్రమదారులు ఉత్పత్తిని తగ్గించి వేశారు. డిసెంబరులో ప్రారంభం కావాల్సిన ఇటుక ఉత్పత్తి జనవరి మధ్యలో ప్రారంభించారు. కోటి ఇటుకలు తీసే పరిశ్రమదారులు సైతం ప్రస్తుతం 50 లక్షల ఇటుకలు మాత్రమే ఉత్పత్తి చేస్తున్నారు. 180 పరిశ్రమలలో ప్రస్తుతం 90 నుంచి 100 పరిశ్రమలు మాత్రమే ఇటుక ఉత్పత్తిని చేస్తున్నాయి. ప్రస్తుతం ఒక్కో ఇటుక తయారీకి రూ.5.30లు ఖర్చు అవుతుండగా ఇటుక అమ్మకాలు మాత్రం రూ.4.50 నుంచి రూ.4.80లు మాత్రమే జరుగుతుండటంతో పరిశ్రమదారులకు ఒక్కొక్క ఇటుకకు రూ.50 పైసలు నుంచి రూ.80 పైసలు వరకు నష్టం వస్తున్నట్లు చెబుతున్నారు. వెయ్యి ఇటుకకు రూ.500-800 అమ్మకాల్లో నష్టం వాటిల్లుతుండటంతో ఈ ఏడాది ఉత్పత్తి సగానికి సగం తగ్గించి వేశామని పరిశ్రమదారులు చెబుతున్నారు. ఉత్పత్తులు తగ్గడంతో ఆ ప్రభావం కూలీల జీవనంపై పడటంతో సగానికి సగం మంది ఈ ఏడాది ఇటుక పరిశ్రమల్లో పనులు లేకుండా పోయాయని పరిశ్రమ వర్గాలే చెబుతున్నాయి. రియల్ ఎస్టేట్ పుంజుకుని ఇటుక ధరలు పెరిగితే ఇటుక పరిశ్రమ మనుగడ కొనసాగుతాయని అంటున్నారు. లేదంటే పరిశ్రమ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంది.

నరసరావుపేటలో బర్డ్‌ఫ్లూ మరణం!

● రెండేళ్ల చిన్నారి మృతి

● గుంటూరులో హెచ్5ఎన్1 సర్వైలెన్స్ సెంటర్‌కు ఆమోదం



గుంటూరు మెడికల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా నరసరావుపేటలో బర్డ్‌ఫ్లూ (ఎవియన్ ఇన్‌ఫ్లూయెంజా/ హెచ్5ఎన్1) మరణం నమోదైంది. నరసరావుపేట పట్టణంలోని బాలయ్య నగర్‌కు చెందిన పెండ్యాల జ్యోతి అనే రెండేళ్ల చిన్నారి బర్డ్‌ఫ్లూతో మరణించినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు మంగళవారం ధ్రువీకరించారు. గత నెలలో చిన్నారి బర్డ్‌ఫ్లూకు గురవ్వగా, కుటుంబీకులు చికిత్స కోసం మంగళగిరిలోని ఎయిమ్స్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ గత వారం చిన్నారి మృతి చెందగా, వ్యాధి లక్షణాలు బర్డ్‌ఫ్లూగా అనుమానించిన వైద్యనిపుణులు రక్తనమూనాలను పూణేలోని నేషనల్ వైరాలజీ ల్యాబ్‌కు పంపారు. జ్యోతి బర్డ్‌ఫ్లూతో మృతి చెందినట్లు సోమవారం ల్యాబ్ రిపోర్ట్ నిర్ధారించింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి నేతృత్వంలో వైద్య సిబ్బంది స్థానికంగా సర్వైలెన్స్ చేపట్టారు.

పల్నాడు డీఎంహెచ్‌వో అభ్యర్థన మేరకు గుంటూరు నుంచి మంగళవారం ర్యాపిడ్ రెస్పాన్స్ మెడికల్ టీమ్ నరసరావుపేటకు వెళ్లింది. ఈ బృందంలో సోషల్ అండ్ ప్రివెంటివ్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ సీతారామతో పాటు మైక్రోబయాలజీ, శిశువైద్యనిపుణులు ఉన్నారు. వీరు పట్టణంలోని బాలయ్య నగర్ పరిసర ప్రాంతాల్లో సర్వైలెన్స్ జరిపి నివేదికను డీఎంహెచ్‌కు అందజేస్తారు. పెండ్యాల జ్యోతి కుటుంబంలో ఇతర సభ్యులు ఆరోగ్యంగా ఉన్నారని, ఎవరికీ ఈ జబ్బు సోకిన దాఖలాలు లేవని వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు వెల్లడించాయి. ముందస్తు జాగ్రత్తగా స్థానికంగా వైద్య సిబ్బంది సర్వైలెన్స్ చేపట్టారు. బర్డ్‌ఫ్లూ మనుషులకు సోకడం అరుదు. బర్డ్‌ఫ్లూ రోగుల్లో 50 శాతం మంది మృతి చెందే ప్రమాదం ఉందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.

గుంటూరులో బర్డ్‌ఫ్లూ సర్వైలెన్స్ సెంటర్...

ఇదిలా ఉంటే గుంటూరులో రీజనల్ బర్డ్‌ఫ్లూ సర్వైలెన్స్ సెంటర్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు గత వారం వైద్య కళాశాల మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ జయలక్ష్మీకి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ నుంచి సమాచారం అందింది. వైద్య కళాశాల ఆవరణలోని స్టేట్ రిఫరల్ వైరాలజీ ల్యాబ్‌కు అనుబంధంగా బర్డ్‌ఫ్లూ సర్వైలెన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తారు. ప్రత్యేకంగా వైద్య పరికరాలు, ల్యాబ్ కన్స్యూమ బుల్స్, ఇతర అవసరమైన వాటిని అందజేస్తారు. 'ఇది రీజరల్ బర్డ్‌ఫ్లూ సర్వైలెన్స్ సెం టర్. గుంటూరు జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ అనుమానిత కేసులు నమోదైనప్పుడు ఇక్కడ వైద్యనిపుణులు సర్వే చేయడంతో పాటు రోగుల నుంచి రక్తనమునాలు సేకరించి వైరాలజీ ల్యాబ్‌లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తామని' జీఎంసీ మైక్రోబయాలజీ హెచ్‌వోడీ డాక్టర్ జయలక్ష్మి మంగళవారం ఆంధ్రజ్యోతికి తెలిపారు.

14వ తేదీ వరకు సెలవులోకి గుంటూరు కలెక్టర్

గుంటూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఈ నెల 5వ తేదీ నుంచి సెలవుపై వెళ్లనున్నారు. గ్రీస్, టర్కీ దేశాలకు కుటుంబ సభ్యులతో కలిసి వ్యక్తిగత కారణాలతో పర్యటనకు వెళ్లేందుకు ఫిబ్రవరి 14వ తేదీనే రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ అనుమతించింది. ఈ నెల 5వ తేదీ నుంచి 14వ తేదీ వరకు కలెక్టర్ నాగలక్ష్మి అందుబాటులో ఉండరు. ఈ నేపథ్యంలో అప్పటివరకు ఇన్‌చార్జ్ బాధ్యతలను జాయింట్ కలెక్టర్ అమిలినేని భార్గవతేజ నిర్వర్తిస్తారని ప్రభుత్వం పేర్కొన్నది.

నగరంలో.. రెండు హత్యలు

మద్యం మత్తులో అకారణంగా ఒకరు

వివాహేతర సంబంధంతో యువకుడు..?

గుంటూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో మంగళవారం రెండు హత్యలు జరిగాయి. రెడ్డిపాలెం వద్ద ధారావత్ రామునాయక్(57), అరండల్‌పేట ఒకటో లేన్ రైల్‌మహల్ వద్ద పోలేపల్లి గణేష్(39) దారుణ హత్యలకు గురయ్యారు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలు.. రెడ్డిపాలేనికి చెందిన బట్టు రాజు మద్యం తాగి ఉన్నాడు. ఆ సమయంలో అటుగా శారదాకాలనీ 25వ లేనుకు చెందిన ధారావత్ రామునాయక్ రెడ్డిపాలెం వాటర్ ట్యాంకుల వైపు నుంచి వస్తుండగా చంపేస్తానని రాజు హెచ్చరించగా నీవల్ల కాదులే అన్నాడు. దీంతో రాజు సమీపంలోని బీరు సీసాతో రాము నాయక్‌పై దాడి చేయగా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించిన పోలీసులు కేసు నమోదు చేశారు. భార్య గతంలోనే మృతి చెందడంతో కూతురు వద్ద రామునాయక్ ఉంటున్నాడు. కొన్నేళ్లుగా విజయవాడలో తాపీ పని చేసుకునే రాజు మద్యం మత్తులో విచక్షణ కోల్పోయి మానసిక ఉన్మాదిగా వ్యవహరిస్తుంటాడు. ఈ క్రమంలోనే రామునాయక్‌ను అకారణంగా హత్య చేశాడు. రాజును పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.

యువకుడి హత్యపై అంతుచిక్కని కారణాలు

అరండడల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో కేవీపీకాలనీకి చెందిన పోలేపల్లి గణేష్(39) హత్యకు గురయ్యాడు. అయితే గణేష్ హత్యకు దారి తీసిన కారణాలు అంతుచిక్కడం లేదు. ఫ్లెక్సీలు కడుతూ జీవనం సాగించే గణేష్ మద్యానికి బానిసయ్యాడు. అరండల్‌పేట ఒకటో లేన్‌లో నివాసం ఉండే పోలమ్మ అనే మహిళ ఇంటికి వచ్చి వెళ్తుంటాడు. ఆమె కొడుకు, అల్లుడితో కలిసి తిరిగే గణేష్ వారితో గొడవపడ్డాడు. ఈ క్రమంలో పోలమ్మ కొడుకు, అల్లుడుతోపాటు వారి స్నేహితులు ఇంకొందరు కలిసి గణేష్‌పై దాడి చేసి హత్య చేసి పరార య్యారు. సమాచారం అందుకున్న అరండల్‌పేట సీఐ వీరాస్వామి సిబ్బంది ఘటనాస్థలిని పరిశీలించి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. అయితే గణేష్ హత్యకు వివాహేతర సంబంధం కారణమా లేదంటే వారి మధ్య నెలకొన్న వివాదం కారణమై ఉంటుందనే తెలియరాలేదు. హతుడు గణేష్‌పై నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో సస్పెక్టెడ్ షీటు ఉన్నట్లు తెలిసింది.



హత్యకు గురైన గణేష్, రాము నాయక్

ఐరన్ ముఠా కార్మికుల కూలి రేట్లను పెంచాలి

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఐరన్ దుకాణాల్లో పనిచేస్తున్న ముఠా కార్మికుల కూలి రేట్లను పెంచాలని ఆంధ్రప్రదేశ్ హమాలీ, ముఠా ఫెడరేషన్(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చిన్న ఆంజనేయులు డిమాండ్ చేశారు. స్థానిక రేగుల రాఘవయ్య భవనంలో మంగళవారం ఐరన్ ముఠా వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడూతూ కూలీ రేట్ల ఒప్పందం కాలపరిమితి ముగిసినప్పటికీ కొత్త ఒప్పందం చేయడానికి యాజమాన్యం ముందుకు రావడం లేదన్నారు. యాజమాన్యం నిర్లక్ష్యవైఖరికి నిరసిస్తూ బుధవారం నుంచి ముఠా కార్మికులు నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్టు స్పష్టం చేశారు. నగర ముఠా కార్మిక సంఘం అధ్యక్షుడు జి సురేష్ బాబు మాట్లాడుతూ ప్రతి రెండేళ్లకు ఒకసారి ముఠా కార్మికుల కూలిరేట్ల అగ్రిమెంటు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించడం జరుగుతుందని, ఈ సారి యాజమాన్యం కాలయాపన చేస్తుందని విమర్శించారు. సమావేశంలో రావుల అంజిబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చల్లా చిన ఆంజనేయులు, పాల్గొన్న ఏఐటీయూసీ నాయకులు

పఠనం.. ప్రోత్సాహం

◆ అందుబాటులో డిజిటల్ పుస్తకాలు

◆ పుస్తక పఠనంతోనే బాలల్లో సంపూర్ణ పరిపక్వత

◆ నేడు ప్రపంచ బాలల పుస్తక దినోత్సవం

గుంటూరు (విద్య), ఏప్రిల్ 1 (ఆంధ్ర జ్యోతి): ఆధునిక యుగంలో.... శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వస్తున్న వినూత్న మార్పుల కారణంగా... కుటుంబాల్లో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ప్రతి ఇంట్లో స్మార్ట్ ఫోన్లు, స్మార్ట్ టీవీలు ఇతర సాంకేతిక పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో బాలల్లో పుస్తక పఠనం క్రమంగా సన్నగిల్లుతోంది. అయితే వారి కోసం ప్రచురించే పుస్తకాల ముద్రణ మాత్రం ఆగడం లేదు. పుస్తకాలను డిజిటల్ రూపంలో ముద్రించి అందుబాటులోకి తీసుకు వస్తున్నారు. బుధవారం అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి అందిస్తున్న ప్రత్యేక కథనం...

గ్రంథాలయాల ఆధ్వర్యంలో...

బాలల్లో పుస్తక పఠనం పాఠ్యపుస్తకాలికే పరిమితం కాకుండా వారు కథల పుస్తకాలను చదివేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం ఏటా నిర్వహించే గ్రంథా లయ దినోత్సవాన్ని పురస్కరించుకుని దాదాపు నెల రోజులపాటు విద్యార్థుల్లో పుస్తక పఠనం పెంపొందించేందుకు వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు వారికి కొత్త పుస్తకాలు అందుబాటులోకి తీసుకువచ్చి చదివించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఆంగ్లం, తెలుగు మాధ్యమాల్లో పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయి.



డిజిటల్ రూపంలోనూ...

పుస్తకాలు డిజిటల్ రూపంలోనూ అందుబాటులోకి వచ్చాయి. పంచతంత్ర కథలు, చందమామ కథలు, అక్బర్ బీర్బల్, తెనాలి రామకృష్ణ, అరేబియన్ నైట్స్ పేరుతో కథల పుస్తకాలు డిజిటల్ రూపంలో బాల లకు అందుబాటులో ఉన్నాయి. జిల్లా కేంద్ర గ్రంథా లయాల్లో కూడా డిజిటల్ పుస్తకాలు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. ఇందుకోసం ప్రత్యేకంగా కంప్యూటర్లు కూడా అక్కడ ఏర్పాటు చేశారు. విద్యార్థులకు పుస్తక పఠనం పట్ల ఆసక్తిని పెంపొందించడమే లక్ష్యంగా ఏటా నిర్వహించే పుస్తక మహోత్సవాలు బాలల్లో పుస్తక పఠనాన్ని పెంపొందించేలా ప్రోత్సహిస్తున్నారు. ప్రత్యేక పోటీలు నిర్వహించి బాలల్లో పుస్తక పఠనాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నారు.

బాలల్లో కథల పట్ల ఆసక్తి పెంపొందించాలి



బాలల్లో కథల పట్ల, దేశనాయకుల పట్ల ఆసక్తి పెంపొందించడానికి పుస్తక పఠనం దోహదం చేస్తుంది. తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపి విద్యార్థుల్లో పుస్తక పఠనం పెంపొందించేలా కృషి చేయాలి. జ్ఞానం, విజ్ఞానం, లోకజ్ఞానం, ఉల్లాసం ఉత్సాహం, వినోదం ఇలా ఎన్నో విభాగాలు బాలల సాహిత్యలో ఉన్నాయి.

-కొండా శివరామిరెడ్డి, బుక్ లవర్స్ అధినేత



అద్దంకి భవానీ సెంటర్‌లో టీ తాగుతూ స్థానికులతో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

మినీ బైపాస్‌కు త్వరలో నిధులు

● మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): అద్దంకిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం మినీ బైపాస్ రోడ్డుకు త్వరలో ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు అవుతాయని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. చినగంజాం మండలంలో సీఎం చంద్రబాబునాయుడు కార్యక్రమానికి హాజరైన ఆయన బుధవారం కనిగిరిలో జరిగే లోకేష్ మీటింగ్‌లో పాల్గొనేందుకు వెళ్తూ మంగళ వారం రాత్రి అద్దంకి పట్టణంలోని భవానీసెంటర్‌లో కొద్ది సేపు ఆగారు. టీ తాగుతూ స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అద్దంకి పట్టణంలో ట్రాఫిక్ సమస్య విషయాన్ని స్థానిక నేతలు మంత్రి దృష్టికి తీసుకుపోయారు. అద్దంకి మేజర్ కాలువను రేణింగవరం రోడ్డు నుంచి నామ్ రోడ్డు వరకు మినీ బైపాస్‌గా మార్చే క్రమంలో శింగరకొండ సమీపంలోని టిడ్కో ఇళ్ల సమీపంలో నామ్ రోడ్డులో కలిసే విధంగా మార్పు చేయాలని పలువురు స్థానిక నాయకులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. త్వరలో సర్వే చేయించి అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. అద్దంకి పట్టణంలో ఇంకా ఏర్పాటు చేయాల్సిన విద్యుత్ స్తంభాల గురించి, సైడ్‌డ్రైన్ లలో మురుగు పారుదల లేక పోవటాన్ని మంత్రి రవికుమార్ దృష్టికి తీసుకు పోయారు. సమస్యలు పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు మంత్రి ఫోన్ చేసి చెప్పారు. టీడీపీ నేతలు కాకాని అశోక్, లహరి, కోనేటి అనిల్, వడ్డవల్లి పూర్ణచంద్రరావు, మాబూ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



శ్రీనగర్‌లో సిమెంట్ బల్లలు ఏర్పాటు చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

సిమెంట్ బల్లల ఏర్పాటు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో పాదచారులు, ప్రజలు వినియోగించుకునేందుకు సిమెంట్ బల్లలను ఏర్పాటు చేశారు. మంగళవారం స్థానిక శ్రీనగర్ రెండోలైన్‌లో మూడు బల్లలు, వీఎస్ఎస్ అపార్ట్‌మెంట్, నాగులపాడు రోడ్డులో 5 సిమెంట్ బల్లలు పలువురు దాతల సహకారంతో ఏర్పాటు చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, సెక్రటరీ చుండూరి మురళి సుధాకరరావు, డాక్టర్ యు. దేవపాలన, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, నర్రా శ్రీలక్ష్మి, జాగర్లమూడి శివకుమారి, చిన్ని కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వేలమూరికి సత్కారం

అద్దంకి, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ఉగాది పురస్కారం అందుకున్న శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ పూజారి వేలమూరి శ్రీరామచంద్రమూర్తిని అద్దంకి సీమ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సత్కరించారు.ఈ కార్యక్రమంలో బ్రాహ్మ ణ సేవా సంఘం అధ్యక్షుడు శ్రీపతి రంగనాథాచార్యులు, ఆరామ క్షేత్రం కన్వీనర్ లక్కరాజు చంద్రశేఖర్, శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం పాలక మండలి సభ్యురాలు జమ్మలమడక రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం పూజారి వేలమూరి శ్రీరామచంద్రమూర్తిని సత్కరిస్తున్న బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

బహుజనుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): అమరావతి బహుజన జేఏసీ చైర్మన్ పోతుల బాల కోటయ్యను మంగళవారం విజయవాడలో ఏపీ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్య వేదిక సభ్యులు కలిశారు. రాష్ట్రంలోని దళితులు, బహుజనుల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చొరవ చూపాలని ఐక్య వేదిక సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు, కమిటీ సభ్యులు కొణిదల విజయ్‌కుమార్, దాసరి బాలకృష్ణ, జ్యోతి శ్రీమన్నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



దైవాలరావూరులో ముమ్మన సాంబశివరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి రవికుమార్ తదితరులు

టీడీపీ నేత కుటుంబానికి మంత్రి పరామర్శ

మేదరమెట్ల, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): మండలంలోని దైవాలరావూరులో తెలుగుదేశం పార్టీ నాయకులు ముమ్మన నరసింహారావు సోదరుడు సాంబశివరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మంగళవారం విద్యుత్ శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ దైవాలరావూరు వచ్చి సాంబశివరావు చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మృతికి కారణాలను అడిగి తెలుసుకొన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఇంకొల్లు ప్రాంత అభివృద్ధి చర్చపై ప్రజల హర్షం

ఇంకొల్లు,ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): చినగంజాం మండలంలోని కొత్తగొల్లపాలెంలో మంగళవారం జరిగిన ప్రజావేదికలో సీఎం చంద్రబాబు దృష్టికి నియోజకవర్గంలోని సమస్యలతో పాటు ఇంకొల్లు ప్రాంతంలో ఉన్న ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తీసుకెళ్లడంపై ఈప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇంకొల్లు మీదుగా గుంటూరు నుంచి నాగులుప్పలపాడు వరకు నాలుగులైన్ల రహదారిగా అభివృద్ధి,ఇంకొల్లులో ప్రధాన సమస్యగా ఉన్న డ్రైనేజీ, ఆటోనగర్ ఏర్పాటు, ఎత్తిపోతల పథకాలకు నిధులు కేటాయించాలని చంద్రబాబును కోరడంపై ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తపరిచారు.

దాతలకు ప్రేరణ.. పేదలకు భరోసా

పర్చూరు నియోజకవర్గం అభివృద్ధికి నిర్దిష్ట హామీలు

పాలనా, పార్టీ వ్యవహారాల్లో ఎమ్మెల్యే ఏలూరికి కితాబు

వినూత్నంగా సాగిన గొల్లపాలెంలో సీఎం చంద్రబాబు కార్యక్రమం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ప్రభుత్వం చేపట్టిన పీ-4 కార్యక్రమం నిర్వహణలో కీలకమైన దాతలకు ప్రేరణ, పేదలకు భరోసానివ్వటంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కొత్తగొల్లపాలెం కార్యక్రమం సఫలీకృతమైంది. గతంలో వలే భారీ ప్రసంగం లేకుండా నిర్దిష్ట విధానంతో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలకు కాస్తంత ఉల్లాసాన్ని మరికాస్త ఉద్వేగాన్ని కల్పించింది. గ్రామంలో పూర్తిగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు, వారి స్థితిగతులను వారి ద్వారానే బహిరంగపర్చి చేయూతనిచ్చే దాతలను ప్రేరణ చేస్తూ కార్యక్రమం నిర్వహించారు అదేసందర్భంలో నియోజకవర్గంలో పార్టీ, పాలనాపరమైన వ్యవహారాల్లో ఎమ్మెల్యే ఏలూరి పాత్రకు కితాబిస్తూ ఎమ్మెల్యే చూసిన సమస్యల చిట్టా చదువుతూనే కొన్ని పనులకు నిర్దిష్టమైన హామీలు ఇస్తూ కొన్నింటిని దాటవేశారు. తొలుత సీఎం హోదాలో గ్రామస్థులతో మమేకమైన ఆయన చివర్లో పార్టీ అధ్యక్షుడి హోదాలో పార్టీశ్రేణులతో మమేకం కావటం విశేషం. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు మంగళవారం పర్చూరు నియోజకవర్గంలోని కొత్తగొల్లపాలెంకు ఆయన వచ్చారు.

పీ-4 కార్యక్రమంపై అవగాహన

గతంలో వలే పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వాహణకే ఆయన పరిమితం కాకుండా కొత్తగా ప్రభుత్వం చేపట్టిన పీ-4 కార్యక్రమం తీరుతెన్నులను ప్రజలకు తెలిపే ప్రయత్నం చేశారు. గ్రామంలో 996 మంది ఉండగా అందులో 17మందికి మరుగుదొడ్లు, 13 మందికి గృహలు, 30మందికి పింఛన్లు, ఒకరికి రేషన్‌కార్డు, నాలుగు గృహలకు విద్యుత్ సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉందని గుర్తించారు. వారందరికీ ఆ సౌకర్యాలన్నీ కల్పించాలనీ అక్కడే ఉన్న కలెక్టర్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. ఆ తర్వాత గ్రామంలో బాగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పది కుటుంబాలను అధికారులు గుర్తించగా వారిని వేదికపైకి పిలిచి మాట్లాడారు. అందులో వెంకాయమ్మ అనే మహిళ తనకు భర్త లేడని, పిల్లలిద్దరూ పెద్దవారైనా కూలీకి పోక తప్పటం లేదని చెబుతూ తనకు వచ్చిన క్యాన్సర్ వ్యాధితో పడుతున్న ఇబ్బందిని విడమర్చి చెప్పారు. అలాగే అంకమ్మ అనే మరో మహిళ భర్త విద్యుత్ షాక్‌తో చనిపోగా తన కుమారుడైన వెంకటేష్‌ను చదివించేందుకు పడుతున్న బాధలను వివరించారు. ఇలా ఐదారు కుటుంబాల వారిని పిలిచి వారితో మాట్లాడి పేదల సమస్యలు ఎలా ఉంటాయో అర్థం చేసుకోండంటూ ప్రజానీకానికి వివరించారు. ఒక మహిళ 'నేను ఈరోజో రేపో రాలిపోతా కానీ నా అల్లుడు అర్థంతరంగా మరణించాడు. ఆ బాధతో నా కుమార్తె పక్షవాతానికి గురైంది. వారిద్దరి పిల్లలు చేయూత లేక తల్లడిల్లుతున్నారు. ఈ వయస్సులో కుటుంబాన్ని ఈదలేకపోతున్నానంటూ' చెప్పిన మాటలతో సీఎం చలించిపోయారు. ఇదే కుటుంబ అనుబంధం అంటూ ఆయన వారికి చెబుతూ మాట్లాడిన మహిళలు తమకోసం కాక పిల్లల కోసం చేస్తున్న అభ్యర్థనలు విని చేయూతనిచ్చే మార్గదర్శకులు(దాతలు) ముందుకు రావాలని కోరారు. అదే వేదిక మీద ముందుగా గుర్తించిన విక్రమ్ నారాయణ(గొనసపూడి), అలాగే ఇంకొల్లు మండలం గొల్లపాలెంకు చెందిన ఆంజనేయులు అనే పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి పీ-4 కార్యక్రమంలో మార్గదర్శి-బంగారు కుటుంబం అనేది మా నినాదం అంటూ వారికి వివరించారు. పారిశ్రామికంగా వారు ఎదిగిన విధానాన్ని స్వగ్రామాల్లో వారు చేస్తున్న సేవా కార్యక్రమాలను తెలుసుకుని, ఈ పేదలను ఆదుకునేందుకు ముందుకు రావాలని బహిరంగంగా కోరారు. అప్పటికే పేదల మాటలతో చలించిపోయిన ఆ వ్యాపారవేత్తలు ఇద్దరు సీఎం ఇచ్చిన స్ఫూర్తితో ఆ కుటుంబాలను దత్తత తీసుకునేందుకు హామీ ఇచ్చారు. తలా 15 కుటుంబాలను ఆర్థికంగా ఉన్నత స్థాయిలోకి తెచ్చే విధంగా వారు చేయాలని సూచిస్తూ తదనుగుణంగా ఆ పారిశ్రామికవేత్తలకు సేవాపుస్తకాలతో సన్మానిస్తానని ప్రకటించారు. ఒక మహిళ కుమారుడైన గణేష్‌ను చదివించే బాధ్యత విక్రమ్‌నారాయణకు అప్పగిస్తూ, క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న మహిళ చికిత్సకు ప్రభుత్వపరంగా పూర్తి ఆర్థిక సహాయం ఇవ్వాలని కలెక్టర్‌కు అక్కడికక్కడే ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయా సందర్భాల్లో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఇప్పటికే ఆ గ్రామంలోని పలువురు పేదలకు తన ట్రస్టు ద్వారా ఇస్తున్న చేయూతను, వైద్య చికిత్సను ప్రస్తావిస్తూ కొనియాడారు.

పోర్టు కోసం కేంద్రంతో మాట్లాడతా

అదే కార్యక్రమంలో చివర్లో ఎమ్మెల్యే ఏలూరి అందించిన సమస్యల చిట్టాలోని ప్రధాన అంశాలను ప్రస్తావించారు. మోటుపల్లి వద్ద పోర్టు నిర్మాణానికి సాంకేతిక అనుమతులు లభిస్తే కేంద్రంతో మాట్లాడి ఏర్పాటు చేస్తానని చంద్రబాబు ప్రకటించారు. అలాగే అనుబంధ పరిశ్రమలను తీసుకొస్తానని ప్రకటించారు. అలాగే ఎమ్మెల్యే ఇచ్చిన సమస్యల చిట్టాను చదువుతూ నాలుగు కొత్త ఎత్తిపోతలకు, 32 పాత ఎత్తిపోతల పథకాల నిర్వహణకు అవసరమైన నిధులు సమకూర్చుతానని హామీ ఇచ్చారు. సాగర్ కాలువ ఆధునీకీకరణతోపాటు కేడబ్ల్యూడీ ఆయకట్టు పరిధిలో ఆయకట్టు అభివృద్ధి, డ్రైనేజీ సమస్య పరిష్కారానికి రూ.5 కోట్లు మంజూరు చేస్తానని ప్రకటించారు. రోడ్లు, వంతెనలు ఇతరత్రా అనేక సమస్యల పరిష్కారానికి పూర్తిస్థాయి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. గుంటూరు చానల్ పొడిగింపు విషయంలో ఇప్పటికే సానుకూల నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు.



ప్రజావేదికలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, పక్కన ఎమ్మెల్యే ఏలూరి

అగ్రస్థానంలో పర్చూరు

పాలనే కాక రాజకీయ వ్యవహారాలు, పార్టీపరమైన వ్యవహారాల్లో కూడా పర్చూరు నియోజకవర్గం అగ్రస్థానంలో ఉందని చంద్రబాబు కొనియాడారు. హెలిప్యాడ్‌కు సమీపంలో ఏర్పాటుచేసిన వేదిక వద్ద నియోజకవర్గ టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆయన భేటీ అయ్యారు. ఎమ్మెల్యే ఏలూరితోపాటు మంత్రులు గొట్టిపాటి రవికుమార్, సత్యప్రసాద్, ఇన్‌చార్జి మంత్రి పార్థసారధి, బాపట్ల లోక్‌సభ టీడీపీ అధ్యక్షుడు రాజశేఖర్ కూడా పాల్గొన్నారు. నియోజకవర్గంలోని 15మంది పార్టీ నాయకులను పేరుపేరున ప్రస్తావిస్తూ సీఎం అభినందించారు. వరుసగా మూడుసార్లు టీడీపీ గెలుపునకు కీలకపాత్ర పోషించిన ఎమ్మెల్యే ఏలూరి చరిత్ర తిరగరాశాడని కొనియాడారు. ప్రభుత్వ ఉద్యోగిగా ఒక కార్యక్రమంలో కలిసిన ఏలూరి తన అభిమాని అని, అందుకే పనితీరులో తనను అనుసరిస్తూ అహర్నిశలు కష్టపడుతున్నారని తెలిపారు. పార్టీ నిర్మాణ వ్యవహారాల్లో రాష్ట్రంలో తొలి మూడు స్థానాల్లో నియోజకవర్గం ఉందన్నారు. వ్యక్తిగతంగా ఏలూరికి 100కు 88 పైబడి మార్కులు తెచ్చుకున్నారన్నారు. పర్చూరు నియోజకవర్గ అభివృద్ధికి పూర్తిస్థాయిలో తోడ్పడతానని చంద్రబాబు హామీ ఇచ్చారు.

పేరుకున్న చెత్తా చెదారం

● అధ్వానస్థితిలో అంతర్గత రహదారులు

● 21వ వార్డులో ప్రజల ఇక్కట్లు

చీరాల, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం పరిధిలోని పలు వార్డుల్లో చెత్తా చెదారం పేరుకు పోయింది. కొన్ని ప్రాంతాల్లో నెలలు గడుస్తున్నా మునిసిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా 21వ వార్డు బొమ్మల తోట, మేడా వారి వీధుల్లో అంతర్గత రహదారులు శిథిల దశకు చేరి రాత్రిళ్ల ప్రయాణాలు సాగించేందుకు ప్రజలు నానా తంటాలు పడుతున్నారు. అలాగే ఆయా రహదారుల వెంబడి వ్యర్థాలు దారుణంగా పేరుకుపోయి దర్శనమిస్తున్నాయి. ప్లాస్టిక్ సైతం పెద్ద ఎత్తున కుప్పలుగా ఉన్నాయి. ఈక్రమంలో రహదారుల్లో సంచరిస్తున్న మూగ జీవాలు ఈ వ్యర్థాల్లో ఆహారం కోసం తిరుగాడుతూ ప్లాస్టిక్‌ను తిని మృత్యువాత పడుతున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి చెత్త సేకరణ చేసి మూగ జీవాల ప్రాణాలు రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.





రహదారి పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం (ఇన్‌సెట్లో) శిథిలమైన డ్రైయిన్

పాస్టర్ మృతిపై విచారణ చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి):పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమ గ్ర విచారణ చేపట్టాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఒంగోలులో పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యం లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ వద్ద ధర్నా, చర్చి సెంటరులో మానవహారం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి రఘురాం, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కారం ప్రదానం

ఒంగోలు కల్చరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): శ్రీఅభయ కళారాధన సాంస్కృతి క సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మద్దాలి మాధవరావుకు ఎల్‌సీఈఎస్ కళానిలయం సంస్థ జాతీయ ఉగాది పురస్కారం, లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు పురస్కారాలను అందజేశారు. మంగళవారం ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో ఆయనకు డాక్టర్ కొలకలూరి రవిబాబు, నర్సింగోలు శ్రీని వాసప్రసాద్, మౌర్య పలువురు వేదపండితులు ఈ పురస్కారాలను అందజేసి ఘనంగా సత్కరించారు.

ఆనవాయితీగా చలువ పందిళ్ల ఏర్పాటు

అద్దంకిలో తరతరాలుగా కొనసాగిస్తున్న వ్యాపారులు

శ్రీరామ నవమి రోజు కల్యాణోత్సవం

3 నెలల పాటు కొనసాగింపు

కొనుగోలుదారులు, ప్రజలకు ఉపశమనం

అద్దంకి, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): అద్దంకిలో తరతరాలుగా చలువ పందిళ్ల ఏర్పాటు ఆనవాయితీని వ్యాపారులు కొనసాగిస్తున్నారు. ఉగాది నుంచి చలువ పందిళ్ల వేయటం ప్రారంభించి శ్రీరామనవమి నాటికి పూర్తి చేస్తారు. చలువ పందిళ్ల కింద శ్రీరామనవమి రోజు సీతారాముల కల్యాణం నిర్వహిస్తారు. కల్యాణం పూర్తయిన తరువాత నుంచి ఎండల తీవ్రత తగ్గే వరకు సుమారు 3 నెలల పాటు చలువ పందిళ్లను అలానే ఉంచుతారు. ఈ నేపథ్యంలో అద్దంకి పట్టణంలో ఇప్పటికే రామాటాకీస్ బజార్‌లో మూడు చలువ పందిళ్లు, పాత గాంధీబొమ్మసెంటర్ లో తాటాకుతో ఒక చలువ పందిరి ఏర్పాటు చేశారు. అత్తులూరివారి వీధి, గానుగపాలెం తదితర ప్రాంతాలలోని రామాలయాల వద్ద చలువ పందిళ్ల ఏర్పాటు చేయనున్నారు. రామాటాకీస్ బజార్, పాత గాంధీ బొమ్మసెంటర్ లలో అత్యధిక శాతం వ్యాపార సంస్థలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో చలువ పందిళ్లతో స్వామి కార్యం, స్వకార్యం నెరవేరుతుంది. శ్రీరామనవమి రోజు సీతారాముల కల్యాణం చలువ పందిళ్ల కింద నిర్వహిస్తారు. అనంతరం మరో మూడు నెలల పాటు ఆ చలువ పందిళ్లను అలానే ఉంచుతారు. దీంతో ఎండా కాలంలో వేడిమి తీవ్రత తగ్గేందుకు దోహదపడుతుంది.



అద్దంకి పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ ఎదురు రామాటాకీస్ బజార్‌లో వేసిన చలువ పందిళ్లు



అద్దంకి లోని పాత గాంధీబొమ్మ సెంటర్‌లో వేసిన చలువ పందిరి

తాతల కాలం నుంచే ఏర్పాటు



నా చిన్నతనం నుంచి పాత గాంధీ బొమ్మ సెంటర్‌లో చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. మా తాతల నుంచే చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తుండే వారని చెబుతారు. గ్రామాల నుంచి వివిధ పనుల కోసం వచ్చిన ప్రజలు అవసరమైన సరుకులు కొనుగోలు చేసుకొని ప్రశాంతంగా సేద తీరే వారు.

-మారం కోటేశ్వరరావు, రిటైర్డ్ హిందీ పండిట్, మారం వారి వీధి, అద్దంకి

ఆనవాయితీని కొనసాగిస్తున్నాం



తర తరాలుగా వస్తున్న ఆనవాయితీని మేము కూడా కొనసాగిస్తున్నాము. వ్యాపారులందరం తలా కొంత చందాలు వేసుకొని చలువ పందిళ్ల ఏర్పాటు చేస్తున్నాం. ఎండలో వచ్చిన పలువురు చలువ పందిరి కింద కొద్ది సేపు ఆగి సేద తీరుతుంటారు. ప్రజలకు చాలా ఉపయోగంగా ఉంది.

-చిన్ని ప్రసాద్, పాత గాంధీబొమ్మసెంటర్,అద్దంకి

మూడు నెలల పాటు ఉంచుతాం



రామాటాకీస్ బజార్‌లో చలువ పందిళ్లను 25 సంవత్సరాల నుంచి ఏర్పాటు చేస్తున్నాము. శ్రీరామనవమి రోజు సీతారాముల కల్యాణం చలువపందిరి కింద చేస్తాం. అనంతరం మూడు నెలల పాటు అలానే ఉంచుతాం. బాగా వర్షాలు పడి ఎండ తీవ్రత తగ్గిన తరువాత తొలగిస్తాం.

-నాగసూరి రమేష్, రామాటాకీస్ బజార్, అద్దంకి

అభివృద్ధి పనులపై జీఎస్టీ పిడుగు

● గత మూడేళ్లలో పనులు చేసిన వారి వివరాల సేకరణ ● త్వరలో నోటీసులు పంపనున్న కమర్షియల్ టాక్స్ అధికారులు

చీమకుర్తి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి మండలంలో మండల పరిషత్ నిధులతో అభివృద్ధి పనులు చేసినవారిపై జీఎస్టీ పిడుగు పడనుంది. గత మూడేళ్లలో పనులు చేసిన వారి వివరాలను తమకు అందజేయాలని కమర్షియల్ ట్యాక్స్ అధికారులు ఎంపీడీవోకు అధికారికంగా లెటర్ ఇవ్వటంతో పాటు ఒక అధికారి ప్రత్యేకంగా మండల కార్యాలయానికి విచ్చేసి వివరాలను త్వరగా అందజేయాలని కోరటం గమనార్హం. ఈ విషయం తెలుసుకున్న వర్క్‌లు చేసిన వారిలో ఆందోళన వ్యక్తం అవుతుంది. గత మూడేళ్లలో కూటమి ప్రభుత్వం రాకముందు వైసీపీ ప్రభుత్వ హయాంలో దాదాపు రూ.22కోట్ల వివిధ రకాల పనులను గ్రామాలలో నిర్వహించారు. మండలపరిషత్ పగ్గాలు వైసీపీ చేతిలో ఉండటంతో పనులన్నీ ఆ పార్టీ నాయకులే నిర్వహించారు. అయితే పనులు నిర్వహించిన వారిలో జీఎస్టీ నంబర్ కల్గిన వారికి పెద్దగా ఇబ్బంది లేదు. వారు ఎప్పటికప్పుడు జీఎస్టీ వివరాలను వాణిజ్య పన్నులశాఖకు అప్‌డేట్ చేస్తుంటారు. కానీ ఎక్కువ మంది జీఎస్టీ ఖాతాలు లేనివారే నామినేషన్ పద్ధతిలో గ్రామాల్లో పనులు నిర్వహించారు. ఇపుడు వారందరూ నోటీసులు అందుకోనున్నారు. 18శాతం చొప్పున దీనికి అదనంగా వడ్డీతో సహ జీఎస్టీ రూపంలో డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. అంటే రూ.5లక్షలు వర్క్ చేస్తే దాదాపు రూ.90వేలను చెల్లించాల్సి ఉంటుంది. ఎపుడో చేసిన పనులకు ఇపుడు అదనంగా డబ్బులు చెల్లించాల్సి రావటం పట్ల పనులు చేసినవారికి పాలుపోవటం లేదు. నోటీసులు అందితే దాని ని బట్టి ఏమి చేయాలో డిసైడ్ అవుదాములే అని వైసీపీ అధిష్ఠానం తమ నాయకులను ఊరడిస్తుంది. కాగా దీని ఎఫెక్ట్ కొత్తగా నిర్వహించబోయే పనులపై కూడా పడుతుంది. మండల నిధులతో పనులు నిర్వహించటానికి పనుల వివరాలు అందచేస్తే వర్క్ ఆర్డర్స్ ఇస్తామని వైసీపీ నాయకులు చెబుతున్నా గ్రామాల్లో వైసీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ముందుకురావటానికి జంకుతున్నారు. 18శాతం జీఎస్టీ చెల్లిస్తే తమకు మిగిలేదేముంది అని వెనుకాడుతున్నారు. దీంతో మండల ఖాతాలో ఉన్న రూ.21కోట్లతో అభివృద్ధి పనులు నిర్వ హించడానికి ఇరువర్గాల మధ్య సఖ్యత కుదిరి నా జీఎస్టీ వ్యవహారంతో ముందుకు సాగటం లేదు.



నేడు ఫ్యాప్టో ఆధ్వర్యంలో ధర్నా

ఒంగోలు విద్య, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం స్థానిక కలెక్టరేట్ ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ చైర్మన్ కె.ఎర్రయ్య, సెక్రటరీ జనరల్ రఫీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12వ పీఆర్సీ కమిటీ వెంటనే ఏర్పాటు చేయాలని, 20శాతం ఐఆర్ ప్రక టించాలని, మిగిలిన ఆర్థిక బకాయిలు, జడ్పీ పీఎఫ్ లోన్లు, సరెండర్‌లీవ్ బ కాయిలు విడుదల చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తదితర డిమాండ్లతో ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

పంచాయతీలకు భారం కానున్న ట్రాక్టర్లు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామ పంచాయతీల కు ప్రభుత్వం మంజూరు చేసిన ట్రాక్టర్లు ఆర్థికభారం కానున్నాయని సర్పం చ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వీరభద్రాచారి మంగళవారం ఒక ప్రక టనలో ఆరోపించారు. ప్రభుత్వ చర్య మంచిదే అయినప్పటికీ పంచాయతీలకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ఇప్పటికే చెత్త రిక్షాలు మరమ్మ తులకు గురైతే నిధులు లేక అవి మూలన పడేస్తున్న విషయాన్ని గుర్తుచేశా రు. గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు ఇవ్వలేని స్థితిలో పంచాయతీలు ఉంటే ట్రా క్టర్ డ్రైవర్ జీతం, డీజిల్‌లాంటి ఖర్చులను భరించే పరిస్థితి లేదన్నారు.

అవీ..ఇవీ



మాట్లాడుతున్న అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి శ్రావణి ప్రియదర్శిని

చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి

మేదరమెట్ల, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి శ్రావణి ప్రియదర్శిని తెలిపారు. మంగళవారం మేదరమెట్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలబాలికలు పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్ వాడకాన్ని తల్లిదండ్రులు నియంత్రించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీనివాస్, ప్రకాశ్, రమణయ్య, మహ్మద్ రఫీ, ఏఎస్‌ఐ అహ్మద్, హెచ్‌ఎం అంజయ్య, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



కొండమంజులూరు ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటైన స్కౌట్స్ అండ్ గైడ్స్ సభ్యులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ఏర్పాటు

పంగులూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి):మండలంలోని కొండమంజులూరు ఉన్నత పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ఏర్పాటు చేశారు.పీఎంశ్రీ పాఠశాలగా ఎంపికయిన కొండమంజులూరు ఉన్నత పాఠశాలలో యూనిట్ ఏర్పాటుకు ఏపీ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల మేరకు 16 మంది బాలురు, 16 మంది బాలికలతో మంగళవారం యూనిట్లను ఏర్పాటు చేశారు. బాలుర స్కౌట్ బృందానికి స్టెల్లార్ స్కౌట్స్‌గా, బాలికల బృందానికి ఎలైట్ గైడ్స్‌గా నామకరణం చేశారు. బాలుర యూనిట్‌కు స్కౌట్ మాస్టర్‌గా సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు ఎం.వేణు, బాలికల యూనిట్ కెప్టెన్‌గా క్రాఫ్ట్ ఉపాధ్యాయిని ఎస్.అనూరాధ వ్యవహరిస్తారని ఆ పాఠశాల హెచ్‌ఎం అనిత తెలిపారు.



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

ప్రాంగణ ఎంపికలో 20 మంది విద్యార్థులకు ఉద్యోగాలు

చీరాల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : క్యాడ్‌సీస్ ఇండియా లిమిటెడ్ వారు నిర్వహించిన ప్రాంగణం ఎంపికలలో స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన 20 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. ఈసందర్భంగా మంగళవారం కళాశాలలో సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు అభినందన సభ నిర్వహించారు. ఈనెల 12వ తేదీన వీరు ఉద్యోగాల్లో చేరనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్, తదితర సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

నేడు వార్షిక ప్రణాళిక తయారీపై శిక్షణ

బల్లికురవ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాదికి స్వయం సహాయక సంఘాల వార్షిక ప్రణాళిక తయారీపై బుధవారం స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో శిక్షణ జరుగుతుందని వెలుగు ఏపీఎం రాజారావు తెలిపారు. మొదటి విడతగా పెద అంబడిపూడి, బల్లికురవ, కొప్పెరపాడు, కొణిదెన క్లస్టర్లలోని ఎన్యూమరేటర్స్‌కు శిక్షణ ఉంటుందని ఏపీఎం తెలిపారు.

మచ్చలేని నాయకుడు.. నిరంతర శ్రామికుడు

ప్రజావేదికలో ఎమ్మెల్యే ఏలూరికి సీఎం కితాబు

మీ ప్రాంత సమస్యలు పరిష్కరిస్తానని ముఖ్యమంత్రి హామీ

వెంటనే కలెక్టర్‌కు స్పష్టమైన ఆదేశాలు

పర్చూరు(చీరాల), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మీ ఎమ్మెల్యే ఏలూరి మచ్చలేని నాయకుడు. సొంతంగా వ్యాపారం చేసుకుంటూ ప్రజాసేవలో ఉత్సాహంగా ఉంటున్నారు. ఎక్కడా వివాదాలకు తావివ్వకుండా తనదైన శైలిలో అభివృద్ధికి పాటుపడుతున్నారు. సుమారు 20 ఏళ్ల క్రితం మొక్కలు నాటే కార్యక్రమంలో నేను నాటిన మొక్కలకు నీరు అందించేందుకు వచ్చి నాకు దగ్గరయ్యాడు. ఈక్రమంలోనే వరుసగా ఇది మూడోసారో లేక నాలుగోసారో ఎమ్మెల్యేగా పని చేస్తున్నారు. అంటూ సీఎం నారా చంద్రబాబునాయుడు నవ్వుతూ పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు గురించి మంగళవారం చిన గంజాం మండలం పెద గంజాం ఆవులదొడ్డి కొత్త గొల్ల పాలెంలో జరిగిన ప్రజావేదిక కార్యక్రమంలో మాట్లాడారు. దీంతో ఆ ప్రాంగణమంతా జై సాంబన్న, జై చంద్రన్న అంటూ నినాదాలతో మార్మోగింది. అనంతరం సీఎం మాట్లాడుతూ మీ ఎమ్మెల్యే ఊరికే కార్యక్రమాలు నిర్వహించరు. నా వద్ద ఇప్పటికే నియోజకవర్గానికి చేయాల్సిన పనులకు సంబంధించిన అంశాలను కట్టలు, కట్టలు పేర్చి నాముందు ఉంచారు. అంటూ సీఎం మాట్లాడిన మాటలు ఆసక్తికరంగా మా రాయి. ఈక్రమంలో చూస్తుంటే పక్కా ప్రణాళికతోనే ఏలూరి గ్రామ సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లినట్లు అర్థమవుతోంది. అయితే అందుకు సీఎం కూడా సానుకూలంగానే సమస్యలపై స్పందించారు. కొత్త గొల్ల పాలెం మాత్రం దాదాపుగా నలభై సంవత్సరాలుగా టీడీపీకి కంచుకోటగా ఉండి పార్టీకి అండగా, ఏలూరికి తోడుగా ఉంటున్నట్లు సీఎం చెప్పారు. ఈక్రమంలో గ్రామ ప్రజల రుణం తీర్చుకునే సమయం వచ్చినట్లు చెప్పారు. ఈక్రమంలోనే కలెక్టర్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీచేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలోకి రాగానే మరుగుదొడ్లు 17, పింఛన్‌లు 30, హౌసింగ్ 13, విద్యుత్ మీటర్‌లు 4, రేషన్ కార్డుల సమస్యలు నాదృష్టికి వచ్చినట్లు సీఎం చెప్పారు. వాటన్నింటిని వెంటనే మంజూరు చేసి పనులు ప్రారంభించాలని కలెక్టర్ వెంకట మురళీకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో హర్ష ధ్వానాలతో ప్రాంగణం మారుమోగింది.

వీధి దీపాలు కచ్చితంగా వెలగాలి. ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రం ఏర్పాటు చేసేలా సూచనలు చేశారు. త్వరలోనే చినగంజాంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం చెప్పారు. మైనార్టీల కోసం ఈద్గాలు, ఎస్సీ ఎస్టీ, బీసీలకు కమ్యూనిటీ హాల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. అన్ని కులాలకు బరియల్ గ్రౌండ్స్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. వలపర్ల ఇండస్ట్రియల్ పార్క్‌ను ఆధునీకీకరణ విధానంలోకి తెస్తామని వివరించారు. గుంటూరు చానల్‌ను ఆధునీకరించనున్నట్లు చెప్పారు. రైతులు ఐక్యమత్యంతో మెలిగితే మేనేజ్‌మెంట్ విధానంతో అవుట్ సోర్సింగ్ విధానాన్ని ప్రవేశపెట్టి మరమ్మతులకు గురి కాకుండా చూస్తామన్నారు. రైతులు ఐక్యంగా ఉంటే ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా సమస్యలు దరిచేరవని సూచించారు. అయితే ప్రస్తావించిన అంశాలన్నీ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ముఖ్యమంత్రికి దృష్టికి తీసుకువెళ్లగా సీఎం సానుకూలంగా స్పందించారు.



ప్రజా వేదికలో ఎమ్మెల్యే ఏలూరిని అభినందిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు



సీఎం చంద్రబాబును ఆప్యాయంగా పలుకరిస్తూ కరచాలనం అందిస్తున్న గ్రామస్థులు

మండుటెండలో సీఎం కోసం నిరీక్షణ

- కరచాలనంకు పోటీపడిన గ్రామస్థులు

పర్చూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : చినగంజాం మండలం పెద్దగంజాం ఆవులదొడ్డి కొత్తగొల్లపాలెంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబును చూసేందుకు గ్రామస్థులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మండుటెండను కూడా లెక్కచేయకుండా సీఎం కోసం నిరీక్షించారు. తనకోసం వచ్చిన ప్రజలను సీఎం ఆప్యాయంగా పలుకరించారు. ఆ సందర్భంలో ముఖ్యమంత్రికి కరచాలనం ఇచ్చేందుకు పోటీపడ్డారు.

సీఎం వెంట ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే కొండయ్య మంగళవారం పర్చూరు నియోజకవర్గంలో జరిగిన పింఛన్ల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా అడుగడుగునా సీఎం వెంట ఉంటూ ఆయా కార్యక్రమాలకు సంబంధించిన పనుల్లో మంత్రులు, సహచర ఎమ్మెల్యేలతో మమేకమయ్యారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయడంలో పాత్రులయ్యారు. ఎమ్మెల్యేతో పాటుగా చీరాల నుంచి ఆప్కో చైర్మన్ సజ్జా హేమలత, వివిధ హోదాల్లోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీఎం వాహనం ముందు కాలినడకన వెళుతున్న ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

ప్రశాంతంగా ముఖ్యమంత్రి పర్యటన

చినగంజాం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా ముగిసిందని ఎస్పీ తుషార్‌డూడీ అన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో సమర్థవంతంగా బందోబస్తు విధులు నిర్వహించిన పోలీసు అధికారులను, సిబ్బందిని గుంటూరు సౌత్ కోస్టల్ జోన్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, బాపట్ల ఎస్పీలు అభినందించారు. మండలంలోని పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని ఆవులదొడ్డికొత్తగొల్లపాలెం గ్రామంలో ముఖ్యమంత్రి మంగళవారం పేదల సేవ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. సీఎం పర్యటన నిమిత్తం సౌత్ జోన్ ఐజీ, జిల్లా ఎస్పీలు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి సీసీ కెమెరాల ఆధారంగా పరిస్థితులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పోలీసులను అప్రమత్తం చేశారు.

ఎటువంటి సంఘటనలు జరగకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఎం పర్యటన ప్రశాంతంగా ముగియటంతో సిబ్బందిని బాపట్ల జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



సీఎం పర్యటన బందోబస్తులో పోలీస్ అధికారులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పింఛన్ల పంపిణీలో మంత్రి గొట్టిపాటి

పంగులూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి):పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని భగవాన్‌రాజుపాలెం గ్రామ ఎస్సీ కాలనీలో మంగళవారం వృద్ధులు, దివ్యాంగులకు మంత్రి గొట్టిపాటి సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. ప్రతి నెలా ఒకటవ తేదీన క్రమం తప్పకుండా సామాజిక పింఛన్లు ఇంటి వద్దనే లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేసే పనిలో ప్రభుత్వం అడుగులు వేస్తున్నదని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో ముఖాముఖి మాట్లాడిన మంత్రి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ప్రజలనుంచి అర్జీలనుస్వీకరించారు.గ్రామంలో సామాజిక భవనాలు, డ్రైనేజ్ నిర్మాణాలకు హామీ ఇచ్చారు. జాతీయ రహదారి పక్కన విద్యుత్ లైన్ ఆధునీకీకరణ చేపట్టాలన్నారు. కాలనీలో అసంపూర్తిగా ఉన్న చింతల చెరువు ముక్కంటి ఇంటి నిర్మాణం కోసం అవసరమైన సిమెంట్, ఇనుము వెంటనే సమకూర్చాలని వ్యక్తిగత సిబ్బందిని ఆదేశించారు. మాటలు సరిగారాక, మానసిక, శారీరక అంగవైకల్యంతో మంచానికే పరిమితమైన చింతలచెరువు శాంతికుమారికి అర్హతగల పింఛన్ అందేలా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో విద్యుత్ ఈఈ మస్తానరావు, ఏఈ అనిల్, హనుమంతరావు, ఈవోఆర్డీ సుమంత్, స్థానిక నేతలు నార్నె సుబ్బారావు, శ్రీకాంత్, శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్,కేవీ సుబ్బారావు, కుక్కపల్లి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగును చూసి మంత్రి ఆగ్రహం

జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న భగవాన్‌రాజుపాలెం గ్రామ ఎస్సీ కాలనీలో నివాస గృహాల ముందు సీసీరోడ్డుపై మురుగు పేరుకుని ఉండటంపై మంత్రి గొట్టిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైనేజ్ నిర్మాణం చేపట్టి మురుగు నీరు రోడ్డుపై నిల్వకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినా ఎందుకు చర్యలు చేపట్టడం లేదని సిబ్బందిని ప్రశ్నించారు. హైవే అధికారులతో పాటు రెవెన్యూ, పోలీస్ అధికారులను సమన్వయం చేసుకుంటూ సమస్య పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు.



భగవాన్‌రాజుపాలెం గ్రామంలో వృద్ధురాలికి సామాజిక పింఛన్ అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి



అద్దంకి పట్టణంలోని 12 వ వార్డులో పింఛన్ డబ్బులు సచివాలయ సిబ్బంది తో కలిసి పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ అత్తులూరి రమేష్

మొదటి రోజు 93 శాతం పింఛన్ల పంపిణీ

బల్లికురవ: మండలంలోని 21 గ్రామ పంచాయతీలలో మంగళవారం 93 శాతం పింఛన్లను పంపిణీ చేశామని ఎంపీడీవో కుసుమకుమారి తెలిపారు. బుధవారం కూడా పంపిణీ జరుగుతుందని, మిగిలి పోయిన వారు వెంటనే తీసుకోవాలని ఎంపీడీవో కోరారు. కూకట్లపల్లి గ్రామంలో టీడీపీ నేతలు ఇప్పల అంజిరెడ్డి, పందిరి అబ్రహాం తదితరులు పింఛన్ల కార్యక్రమాన్ని పరిశీలించారు.

పేద కుటుంబాలకు ఆసరాగా పింఛన్

అద్దంకి : ప్రభుత్వం అందిస్తున్న సామాజిక పింఛన్ నగదు పేద కుటుంబాలకు ఆసరాగా నిలుస్తుందని 12 వ వార్డు కౌన్సిలర్ అత్తులూరి రమేష్ బాబు అన్నారు. మంగళవారం 12 వ వార్డు పరిధిలో పింఛన్‌ల పంపిణీని స్థానిక టీడీపీ నేతలతో కలిసి ఆయన పర్యవేక్షించారు. సచివాలయ సిబ్బందితో కలిసి పంపిణీ చేశారు.

వితంతు పింఛన్ల పంపిణీ

రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ముప్పవరంలో భర్తను కోల్పోయిన మహిళలకు మంజూరైన వితంతు పింఛన్‌లను మంగళవారం పంపిణీ చేశారు. ముప్పవరం గ్రామానికి చెందిన నందిపాటి మల్లేశ్వరి, తోట నాగేంద్రంలకు జనవరి నుంచి వితంతు పింఛన్ మంజూరైంది. ఎంఎల్‌సీ ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయిన మూడు నెలల పింఛన్ మొత్తాన్ని ఒక్కొక్కరికి రూ. 12 వేల వంతున స్థానిక టీడీపీ నేత కుక్కపల్లి ఏడుకొండలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అద్దంకి మండలంలో

అద్దంకిటౌన్ : మండలంలోని అన్ని గ్రామాలల్లో సచివాలయ సిబ్బంది మొదటి రోజు పెన్షన్ల పంపిణీ వేగవంతంగా చేసినట్లు ఎంపీడీవో బత్తిన శింగయ్య మంగళవారం ఒ క ప్రకటనలో తెలిపారు. 95.25 శాతం పెన్షన్‌ల పంపిణీ పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.

తీరంలో అలల తాకిడికి యువకుడి మృతి

- మరొకరిని రక్షించిన పోలీసులు

రామాపురం(చీరాల), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : రామాపురం సముద్రతీరంలో యువకుడు మృత్యువాత పడ్డాడు. ఈఘటన మంగళవారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం పర్చూరు నెహ్రూనగర్‌కు చెందిన చుక్కా వంశీ(23) మిత్రులు సుమారు 40 మందితో కలిసి రామాపురం సముద్రతీరానికి వచ్చారు. ఈక్రమంలో ఎక్కువ సమయమే తీరంలో గడిపారు. ఈక్రమంలో వంశీ, రాజేష్ గల్లంతవుతుండగా, మెరైన్ వేటపాలెం పోలీసులు రాజేష్‌ను రక్షించి ఒడ్డుకు చేర్చారు. అయితే వంశీ మాత్రమే గల్లంతయి, కొద్ది సమయానికే మృతదేహం ఒడ్డుకు చేరింది. ఈక్రమంలో వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ఏరియా వైద్యశాలకు తరలించారు.



మృతిచెందిన వంశీ

స్కూటీ ఢీ కొని మహిళకు తీవ్ర గాయాలు

- స్పందించి వెంటనే 108లో పంపిన సీఐ సుబ్బరాజు

అద్దంకి, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): రోడ్డు మార్జిన్‌లో నడిచి వెళ్తున్న మహిళను స్కూటీ ఢీ కొనటంతో తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికుల కథనం మేరకు మంగళవారం రాత్రి పద్మ అనే మహిళ స్నేహితురాలుతో కలిసి అద్దంకి పట్టణంలో నుంచి రామ్ నగర్ వైపు నడిచి వెళ్తున్నారు. వెనుక నుంచి వచ్చిన స్కూటీవాలా ఢీ కొట్టి ఆగకుండా వెళ్లిపోయాడు. తీవ్ర గాయాలు కావటంతో స్థానికులు గుమి కూడారు. అదే సమయంలో అటువైపుగా వెళ్తున్న సీఐ సుబ్బరాజు ఆగారు. అప్పటికే 108 వాహనం రావటంతో అందులో ఎక్కించి వెళ్లారు. క్షతగాత్రురాలిని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, మెరుగైన చికిత్స నిమిత్తం ప్రయివేట్ అంబులెన్స్‌లో ఒంగోలు తీసుకువెళ్లారు.



స్కూటీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన మహిళ

రేపు మార్టూరు రామాలయంలో కలశప్రతిష్ఠ

మార్టూరు,ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): మార్టూరు ఈశాన్య రామాలయంలో కలశ ప్రతిష్ఠ గురువారం వైభవంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు నిర్ణయించినట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. గత కొన్నేళ్లుగా రామాలయంలో పూజాధికాలు జరగక పోవడంతో కొంతమంది భక్తులు మరల రామాలయానికి పూర్వవైభవం తీసుకురావాలని,దేవాలయంలో నిత్య పూజలు జరిగేవిధంగా ఉండాలని కోరుకుంటూ ఆలయ పునర్నిర్మాణపనులు చేపట్టారు. 1944లో నిర్మించిన రామాలయంలో కొంతకాలంగా పూజలు నిలిచిపోయాయి. దాంతో కొంతమంది భక్తులు ఆర్థిక సహకారంతో గుడి పునర్నిర్మాణం చేపట్టి పూర్తిచేశారు. గుడికి రంగులు వేసి అందంగా తీర్చిదిద్దారు.గతంలో గుడి పైభాగాన ఉన్న కలశాన్ని గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించుకెళ్లారు. ప్రస్తుతం భక్తులు కొత్తగా కలశాన్ని తయారుచేయించారు.గురువారం కలశ ప్రతిష్ఠ జరగనుంది. అంతేగాకుండా దాత రాయుడు రామాంజనేయులు రామాలయంలో సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి విగ్రహాల ఏర్పాటుకు సహకరించారు. ఈ సందర్భంగా మంగళవారం రామాలయం వద్ద గణపతిపూజ, ప్రధానహోమాలు,అగ్నిప్రతిష్ఠాపన తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ నెల 11 వతేదీన శుక్రవారం ఒంటిమిట్ట రామాలయంలో కళ్యాణం జరిగేరోజున ఈ రామాలయంలో స్వామి వారి కల్యాణం నిర్వహిస్తామని వారు తెలిపారు.





పునర్నిర్మాణం చేసిన మార్టూరులోని ఈశాన్య రామాలయం (ఇన్‌సెట్లో) సీతారామలక్ష్మణుడి ఉత్సవ విగ్రహాలు

ముగిసిన ‘పది’ పరీక్షలు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): గత నెల 17వ తేదీ నుంచి ప్రారంభం అయిన పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. అద్దంకిలోని ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో, తిమ్మాయపాలెం జడ్పీహెచ్‌ఎస్, కాకానిపాలెం జడ్పీ హెచ్‌ఎస్, శ్రీ చైతన్య పరీక్ష కేంద్రాలను ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి, ఆర్ ఐవో ఎస్‌కె బాషా, ఎంఈవో-2 బూదాటి సుధాకరరావులతో కలిసి సందర్శించారు. పరీక్ష కేంద్రాల వద్ద వసతులను పరిశీలించారు. ఈ 5 పరీక్ష కేంద్రాలల్లో మొత్తం 1,009 మంది విద్యార్థులకు గాను నలుగురు గైర్హాజరు కాగా 1,005 మంది పరీక్షలు రాసినట్లు ఎంఈవో బూదాటి సుధాకరరావు తెలిపారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు సందడి చేశారు.



పరీక్షరాసి బయటకు వస్తున్న విద్యార్థులు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పంగులూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పంగులూరులో బుధవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ గోరంట్ల అనిల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు జరుగుతున్నందున విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని,వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.